ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

గురువారం 21 ఆగస్టు 2025





● సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

జీజీహెచ్‌లో.. జన్యు పరీక్షల కేంద్రం

● ఏర్పాటుకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆమోదం
● గుంటూరులో ఇక సికిల్‌సెల్ జబ్బు స్థాయి నిర్ధారణ



గుంటూరు మెడికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ రంగ వైద్య సేవలకు స్టేట్ రిఫరల్ ఆస్పత్రిగా రూపుదాలుస్తున్న గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి జన్యు పరీక్షల కేంద్రం మంజూరైంది. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో ఈ కేంద్రం నిర్మించనున్నారు. గిరిజనుల ఆరోగ్య సంరక్షణ కోసం 'సెంటర్ ఆఫ్ కాంపెటెన్స్' (సీఓసీ)గా ఈ కేంద్రం పని చేయనున్నది. సికిల్ సెల్ జబ్బు స్థాయి తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలు ఈ కేంద్రంలో నిర్వహిస్తారు. దంపతుల నుంచి సేకరించిన రక్త నమూనాల ద్వారా సికిల్‌సెల్ జబ్బు ఉందా? లేదా? ఉంటే ఏ స్థాయిలో ఉంది? రాబోయే రోజుల్లో వీరి ద్వారా సంతానానికి సంక్రమిస్తుందా? లేదా? అని తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలు ఈ కేంద్రంలో జరుగుతాయి. శిశువుల నుంచి సేకరించిన రక్త నమూనాలను కూడా ఇక్కడ పరీక్షిస్తారు.

2047కి వ్యాధి నిర్మూలనే లక్ష్యం

గిరిజనులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సికిల్‌సెల్ ఎనీమియా జన్యుపరమైన రక్తసంబంధిత రుగ్మత. 2047 నాటికి దేశంలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే ధ్యేయంతో 'జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా నివారణ మిషన్'ను కేంద్రం చేపట్టింది. ఇందులో భాగంగా సిల్‌సెల్ జబ్బు ప్రబలంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో పాటు మొత్తం 17 రాష్ట్రాల్లో సీవోసీలు ఏర్పాటు చేస్తున్నారు. ఏపీలో గుంటూరు జీజీహెచ్‌తో పాటు విశాఖలోని కింగ్ జార్జ్ ఆస్పత్రిలో సికిల్‌సెల్ జన్యు పరీక్షల కేంద్రాలకు కేంద్రం ఆమోదం తెలిపింది. కాగా గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసే జన్యు పరీక్షల కేంద్రంలో సికిల్ సెల్ ఎనీమియాతో పాటు థలసీమియా జన్యు పరీక్షలు అందుబాట్లోకి వస్తాయని వైద్యాధికారులు తెలిపారు. ఈ జన్యు పరీక్షల వైద్య పరికరాలను ఏపీ ఎంఎస్ ఐడీసీ ద్వారా టెంటర్లు పిలిచి కొనుగోలు చేయనున్నారు.

ఇన్నోవేషన్.. ఓ ఆశాకిరణం



మంగళగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలే కేంద్రంగా మంగళగిరిలో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ యువతకు ఓ ఆశాకిరణంగా మారనున్నది. ఇన్నోవేషన్ హబ్‌లు దేశంలో ఇప్పటికే కొన్ని ఉన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ప్రారంభించిన హబ్‌కు జాతీయస్థాయి ప్రాముఖ్యత నెలకొంది. దీని ప్రారంభోత్సవానికి ఆహ్వానితులు కాకుండా దాదాపు నాలుగు వందల మందికిపైగా కొత్త స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. వీరు స్టార్టప్‌ల తాలూకు స్టాల్స్‌ను ప్రదర్శించగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా పరిశీలించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను అమరావతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత ఏడాది అక్టోబరులో తొలిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపాదించారు. అయితే ఏడాదిలోగానే ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చేలా చేశారు. వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లను ఏర్పాటుచేసి ఐదు లక్షల మందికి ఉపాధిని కల్పించడమే లక్ష్యంగా ఈ హబ్‌లను ఏర్పాటు చేశారు. నైపుణ్యం కలిగిన ఔత్సాహికులు, మహిళలు, యువతకు ఈ హబ్‌లలో అధిక ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహిస్తారు. వినూత్నమైన ఆలోచనలు కలిగిన యువత వీటిని వినియోగించుకుని బంగారు బాటలు వేసుకునే వీలు కలుగుతుంది. ఇక మంగళగిరిలో హబ్‌ను ప్రారంభించిన తొలి రోజునే రికార్డు స్థాయి

(మిగతా 8వ పేజీలో)



సజీవంగా టాటా

గివ్ బ్యాక్ టూ సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా ఆచరించి సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారు. ఆయన ఆలోచనలు భావితరాలవారికి అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్‌లను ప్రారంభిస్తున్నాము. ఈ హబ్‌ల రూపంలో రతన్ టాటా ఆలోచనలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



● 20 వేల స్టార్టప్‌లు.. 5 లక్షల మందికి ఉపాధి
● ఔత్సాహికులను ప్రోత్సాహించేలా మంగళగిరిలో హబ్
● జాతీయ స్థాయి ప్రాముఖ్యత లభించేలా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
● నాలుగు వందల మందికిపైగా స్టార్టప్ కంపెనీల ప్రతినిధుల హాజరు
● ప్రతిపాదించిన ఏడాదిలోగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కార్యరూపం

వచ్చే నెల 26 నుంచి.. బీచ్ ఫెస్టివల్

● సూర్యలంకకు రానున్న సీఎం చంద్రబాబు నాయుడు
● ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమావేశం

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 26, 27, 28 తేదీల్లో సూర్యలంక సముద్రతీరంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించను న్నారు. ఇందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం కలెక్టర్ వెంకటమురళి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. బీచ్ ఫెస్టివల్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక, పర్యాటక, వినోద అంశాలను జోడించి జిల్లా ప్రత్యేకతను చాటేలా వేడుకలు ఉండాలన్నారు. మూడురోజులు సాంస్కృతిక ప్రదర్శనలు, బీచ్ క్రీడలు, సంగీత, నృత్య వినోద కార్యక్రమాలతో పాటు ఫుడ్ కోర్టులు సందర్శకులను ఆకట్టుకునేలా ఉండాలన్నారు. 27న ముఖ్యమంత్రి చంద్రబాబు సూర్యలంకకు రానున్నారన్నారు. రూ.97.52 కోట్లతో చేపట్టే పర్యాటక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి బీచ్‌ఫెస్టివల్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ లక్ష్మీప్రసన్న, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఏవో మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఆర్ కాదు.. ఎస్ఐఆర్

● బోగస్ ఓటర్ల ఏరివేతకు రంగం సిద్ధం
● ఇంటింటికి వెళ్లి జీవించి ఉన్న ఓటర్ల వరకే నమోదు
● లోపాలు లేకుండా 2026 ఓటరు జాబితాల రూపకల్పన

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏటా ఆగస్టు నెల వస్తుందంటే ఓటర్ జాబితాలకు సంబంధించి స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) ప్రారంభమయ్యేది. దాదాపుగా నాలుగైదు నెలల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహణ, ఓటర్ జాబితాల స్వచ్ఛీకరణ అనంతరం తదుపరి జనవరి మొదటి వారంలో తుది ఓటర్ల జాబితాని ఎన్నికల సంఘం ఆమోదంతో జిల్లా యంత్రాంగాలు ప్రకటించేవి. అయితే ఈ దఫా ఆగస్టు నెల చివరి వారం సమీపిస్తున్నా ఎస్ఎస్ఆర్ ఊసే లేదు. ఇందుకు కారణం బీహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇన్‌క్లూజివ్ రివిజన్(ఎస్ఐఆర్) చేపట్టిన ఈసీ దాదాపుగా 65 లక్షల బోగస్ ఓటర్లను తొలగించడమే. అదే విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేసేందుకు మార్గదర్శకాలు రూపుదిద్దుకుంటున్నాయని, అందుకే ఓటర్ల జాబితాల సవరణ షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఓటర్ జాబితాల సవరణ కార్యక్రమం మరి కొద్ది రోజుల్లోనే పెద్దఎత్తున జిల్లాల్లో జరగనున్నది. ప్రస్తుతం ఉన్న ఓటర్ల పేర్లన్నింటిని డేటా బేస్ నుంచి తొలగిస్తారని రెవెన్యూ అధికారులు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలో ప్రతీ ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్ల పేర్లను నమోదు చేస్తారు. దాంతో చనిపోయిన, డూప్లికేట్, బోగస్ ఓటర్ల ఏరివేత జరుగుతుంది. రాజకీయ పార్టీలు వేలు పెట్టి చూపడానికి చిన్న కారణం కూడా లేకుండా 2026 ఓటర్ జాబితాలు రూపుదిద్దుకుంటాయని తెలిపారు. ఆ ఓటర్ జాబితాల్లో పేరు, తండ్రి పేరు, ఫొటో, చిరునామా వంటి అన్ని వివరాలు కచ్చితత్వంతో కూడుకుని ఉంటాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఎట్టలేదన్నా నాలుగు నెలలకు పైగా కసరత్తు జరుగుతుం దన్న అభిప్రా యాన్ని వ్యక్తపరు స్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రామాణికం

వచ్చే ఏడాది మార్చిలో స్థానిక సంస్థల పదవీకాలం ముగుస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జిల్లా పరిష త్తులు, మండల పరిషత్తులకు ఎన్నికలు జరిపించాల్సి ఉంటుంది. ఎన్నికలు సకాలంలో జరిగి పాలకవర్గాలు ఏర్పడితేనే కేంద్రం నుంచి నిధులు విడుదలౌతాయి. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా ఎన్ని కలు జరుపుతుందన్న అభిప్రాయం అటు అధికార, ఇటు రాజకీయ వర్గాల్లో నెలకొని ఉన్నది. ఈ నేపథ్యంలో సమూలంగా ప్రక్షాళన చేసిన ఓటర్ జాబితాలు ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చేసేందుకు ఉపయోగపడతాయి.

శాంతించిన కృష్ణమ్మ

● లోతట్టు ప్రాంతాల్లో పంటల మునక
● కాజ్‌వేలపై ప్రవహిస్తున్న వరద నీరు
● వరద పొంచి ఉంది.. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు




రేపల్లె : పెనుమూడి వారధి వద్ద కృష్ణమ్మ పరవళ్లు

8



కొల్లూరు : ఇటుక బట్టీలను చుట్టుముట్టిన వరదనీరు



చీరాలలో బస్సుల కోసం వేచియున్న ప్రయాణికులు

ఉచితం సరే.. బస్సులేవి?

పలు గ్రామాల గడపెక్కని ఆర్టీసీ

చీరాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పతిష్ఠాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకంలో ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే బస్సు సౌకర్యం లేని గ్రామాల్లోని మహిళలు ఉచిత ప్రయాణ భాగ్యానికి నోచుకోవడంలేదు. వాడరేవు, గవినివారిపాలెం, కావూరివారిపాలెం, దేవినూతల, బుర్లవారిపాలెం వంటి ప్రాంతాలకు బస్సులే లేవు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన గ్రామీణ మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడుతున్నారు. ఆటోల సంఖ్య పెరగడంతో పల్లె వెలుగు సేవలు ఈ గ్రామాలకు నిలిచిపోయాయి. నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు వేల సంఖ్యలో పట్టణాలకు ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తమ గ్రామాలకు బస్సులు వస్తాయని పలువురు ఎదురు చూస్తున్నారు. అయితే ఇంతవరకు ఆ ఊళ్లకు బస్సులే లేకపోవడంతో ఉచిత సేవలు అందని ద్రాక్షగా మారాయి.

సర్వీసులు ఏర్పాటు చేయండి

మా గ్రామంలో మత్స్యకార కుటుంబాలు అధికం. బతుకు తెరువు కోసంరోజూ చీరాల, బాపట్లకు వెళ్లి వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నాం. కనీసం రెండు సర్వీసులు ఏర్పాటు చేయాలి. - చాపల లక్ష్మీ, వాడరేవు

ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా కట్టడాలు

అద్దంకి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు అడ్డాగా అద్దంకి నిలుస్తోంది. ఎక్కడ చిన్న పాటి ప్రభుత్వ స్థలం కనిపించినా ఆక్రమించు కోవటం, కొంతకాలం ఆధీనంలో ఉంచుకోవడం, విక్రయించడం పరిపాటిగా మారింది. పట్టణంలోని శింగరకొండ రోడ్డులోని ప్రభుత్వ భూములు దశాబ్దాల తరబడి పరాదీనం లోనే ఉన్నాయి. నామ్ రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత స్థలాల విలువ పెరగడంతో ఈ ప్రాంతంలో ఆక్రమిత భూముల విక్రయాలతో పలువురు సొమ్ము చేసుకున్నారు. ఎన్‌టీఆర్ నగర్‌లో నామ్ రోడ్డు వెంబడి ఆక్రమిత భూముల్లో పెద్ద పెద్ద భవ నాలు, బహుళ అంతస్థుల భవనాలు వెలుస్తు న్నాయి. గతంలో చిన్న చిన్న ఇళ్లు ఉండగా, గత వైసీపీ ప్రభుత్వంలో పలువురు పెద్ద భవనాల నిర్మాణం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అదే పంథా కొనసాగుతుంది. మున్సిపల్ అనుమతులు లేకుండానే భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయి. సొంత స్థలాలలో ఇళ్ల నిర్మాణంలో చిన్న పాటి వ్యత్యాసం ఉంటేనే సవాలక్ష పత్రాలు అడిగే మున్సిపల్ అధికారులు కనీసం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా మిన్నకుండటం విమర్శలకు తావిస్తుంది. ఊర చెరువులో గతంలో ఆక్రమణలు జరిగినప్పుడు అప్పటి అధికారులు మిన్నకున్న ఫలితం ప్రస్తుతం అధికారులు బదనాం కావాల్సిన పరిస్థితి నెలకొంది.



ఎన్‌టీఆర్‌నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం



పోలీసుస్టేషన్ వద్ద గ్రానైట్ శ్లాబులు, ముడి రాయి లారీలు

మూడు గ్రానైట్ లారీలు స్వాధీనం

బల్లికురవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మల్లాయపాలెం సమీపంలో మంగళవారం రాత్రి మూడు గ్రానైట్ శ్లాబులు, ముడి రాయి లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు అర్ఐ రాజు తెలిపారు. వేమవరం వైపు నుంచి మల్లాయపాలెం కూడలీలో శ్లాబులతో వెళుతున్న రెండు లారీలను అడ్డుకున్న విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అలానే వేమవరం వైపు వెళుతున్న గ్రానైట్ ముడి రాయి లారీని తనిఖీ చేయగా బిల్లులు లేన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ మూడు లారీలను బల్లికురవ పోలీసుస్టేషన్‌కు తరలిం చారు. పట్టుబడిన మూడు లారీల్లోని సరుకుకు కొలతలు తీసి జరిమానా విధిస్తామని అర్ఐ రాజు తెలిపారు.

టిప్పర్లలో ఇసుక తరలింపు

● చోద్యం చూస్తున్న అధికారులు

కర్లపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన పాత నందాయపాలెం పంచాయతీ పరిధిలోని ఎకరంన్నర పొలంలో ఇసుకకాసురులు ఇసుకను నింపుకుంటున్నారు. సామాన్యుడు ఇసుక కోసం ఇబ్బందులు పడుతున్న తరుణంలో నాలుగు రోజుల నుంచి వందలాది టిప్పర్లతో రాత్రిళ్లు ఇసుకను తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా బాపట్ల నుంచి నియోజకవర్గ నలుమూలలకు టిప్పర్ ఇసుకను రూ.8 వేల నుంచి రూ.9 వేలకు విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పాతనందాయపాలెం వీఆర్వో శివనాగరాజును వివరణ కోరగా బాపట్ల క్వారీ నుంచి ఇసుక వస్తుందని, పొలాన్ని పూడ్చుకుంటున్నారన్నారు. తహసీల్దార్ షాకీర్‌పాషాను వివరణ కోరగా మండలంలో ఇసుక తోలుకునేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు.

పాతనందాయపాలెం స్థలంలో ఇసుక టిప్పర్లు



నిధులున్నా పూర్తి కాని పనులు

పాత చెన్నై రహదారికి గ్రహణం వీడేనా?



దగ్గుబాడు వద్ద రోడ్డు పరిస్థితి

పర్చూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పర్చూరు - ఇంకొల్లు(పాత చెన్నై రహదారి) అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడంలేదు. ఏడేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంది. మోకాలి లోతు గుంతల్లో రాకపోకలతో ప్రయాణికులు అల్లాడుతున్నారు. కాంట్రాక్టరు తాత్సారంతో రెండు నెలలుగా మరమ్మతులు ఒక కొలిక్కిరాలేదు. వర్షాల పేరుతో కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ దేవుడికి ఎరుక కనీసం గుంతలు అయినా పూడ్చాలని వాహన దారులు కోరుతున్నారు. గుంటూరు - నాగలుప్పలపాడు వరకు జాతీయ రహదారుల జాబితాలో పాత చెన్నై రోడ్డును చేర్చాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కేంద్ర మంత్రి పెమ్మసానిలను కోరినా నేటికీ మోక్షం కలగలేదు.



ఇంకొల్లు వెళ్లే రోడ్డు

ముగ్గురు ఏపీపీల తొలగింపు

గుంటూరు(లీగల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని కోర్టులలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులై పనిచేస్తున్న ముగ్గురు ఏపీపీలను ముందస్తు నోటీసుతో ఆ పదవుల నుంచి తొలగిస్తూ హోంశాఖ రాష్ట్ర కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదవ అదనపు జిల్లా కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న పల్లపు కృష్ణ ఫ్యామిలీ కోర్టులో ఏపీపీగా పనిచస్తున్న బీ కోటేశ్వరరావు, నాలుగవ అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ఏపీపీగా పని చేస్తున్న జ్యోత్స్న తొలగించిన వారిలో ఉన్నారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా తొలగించాలని ప్రాసిక్యూషన్ డైరెక్టర్ చేసిన సిఫార్సు మేరకు వీరిపై వేటు పడింది.

పెన్షన్‌లపై వైసీపీ దిగజారుడు రాజకీయం

● విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ స్వామి, పాల్గొన్న టీడీపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పెన్షన్‌లను తొలగిస్తున్నారంటూ వైసీపీ దిగుజారుడు రాజకీయం చేస్తుందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ గడుపూటి నారాయణ స్వామి మండిపడ్డారు. గుంటూరులోని అరండల్‌పేట టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనర్హులకు పెన్షన్ ఇచ్చి కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసిందన్నారు. అటువంటి వారిని గుర్తించేందుకే సదరం పత్రాల పరిశీలన చేపట్టామన్నారు. అర్హులకు పెన్షన్ తొలగించే ప్రసక్తే లేదన్నారు. అనర్హుల పింఛన్ మాత్రమే సెప్టెంబరు నుంచి నిలుపుదల చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగులకు పెన్షన్ పెంచామని గుర్తు చేసుకున్నారు. త్వరలోనే నూరు శాతం రాయితీతో త్రిచక్ర వాహనాన్ని అందజేస్తామన్నారు. గత ఐదేళ్లలో దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి కల్పన చేయని వైసీపీ ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు, మద్రిపాటి శ్రీనివాస్, ఘైనేని లక్ష్మీనారాయణ, కొల్లి అనీల్, వెలుగు శివప్రసాద్, సాయి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఎస్సీ,ఎస్టీ జాబితాలో చేర్చాలి

జాతీయ మత్స్యకార సంఘం సెక్రటరి జనరల్ అనంత నగేష్‌బాబు



ఉత్తరప్రదేశ్ మత్స్యశాఖా మంత్రి సంజయ్‌నిషాద్‌ను సన్మానిస్తున్న అనంత నగేష్‌బాబు

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులను ఎస్సీ,ఎస్టీ జాబితాలో చేర్చాలని జాతీయ మత్స్యకార సంఘం సెక్రటరి జనరల్ డాక్టర్ అనంత నగేష్‌బాబు కోరారు. న్యూఢిల్లీలో లాల్‌కటోర స్టేడియంలో బుధవారం నిషాద్‌రాజ్‌పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మత్స్యశాఖా మంత్రి డాక్టర్ సంజయ్‌నిషాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో పాల్గొన్న బాపట్లకు చెందిన అనంత నగేష్‌బాబు మత్స్యకారుల సమస్యలపై వివరించారు. మత్స్యకారులు రాజకీయంగా ఎదగాలని, మత్స్యశాఖా మంత్రి పదవి మత్స్యకారులకే ఇవ్వాలని, ఢిల్లీలో, కోస్టల్ ప్రాంతాలలో ఐకానిక్ మత్స్యభవన్ నిర్మించాలన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపదయోజన్‌లో మత్స్యకారులకు 60శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. అనంతరం మంత్రిని సన్మానించారు.

క్రీడారంగాన్ని అగ్రస్థానంలో నిలబెడతాం

క్రీడాపోటీలను ప్రారంభించిన శాప్ చైర్మన్ రవినాయుడు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

పెదకాకాని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడా రంగాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ఈనెల 29న విశాఖపట్టణం వేదికగా నేషనల్ స్పోర్ట్స్ డేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి బుధవారం ప్రారంభించారు. నెల్లూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి 2వేల మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. తొలుత ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ కోర్టులను సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. దానిలో భాగంగానే జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు ఈనెల 29న నిర్వహించే స్పోర్ట్స్ డే వేడుకలో సీఎం చంద్రబాబు చేతులు మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామన్నారు. 2029లో ఏపీలో జాతీయ క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు ఎ.రమణారావు, ఎస్.సంతోష్ కుమార్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పాల్ కుమార్, డీఎస్డీవోలు నరసింహారెడ్డి, అజీజ్, ఝాన్సీలక్ష్మి, బి. రాజరాజేశ్వరి, యతిరాజ్, పాల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వరదల పేరుతో వికృత రాజకీయాలు చేస్తే సహించం

● ఎమ్మెల్యేలు నరేంద్ర, శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అమరావతితో పాటు ఇతర ప్రాంతాలు వరదలతో పూర్తిగా మునిగిపోయాయంటూ అంబటి సోదరులు చేస్తున్న వికృత రాజకీయాలను ఇకపై సహించమని పొన్నూరు, తాడికొండ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. టీడీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో జగన్ మోహనరెడ్డికి, అంబటి సోదరులకు ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదన్నారు. నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అంబటి రాంబాబు చేసిన అవినీతి కారణంగానే నేడు ఇటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం ఒక్క సాగు కాలువకు మరమ్మత్తులు చేయలేదన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 320 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసిందని, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటాలు తేలక ఆ ప్రాజెక్టును నిలిపివేశారని ఆరోపించారు. దీంతో గుంటూరు చానల్‌కు గండ్లు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మీ ధన దాహానికి నేడు పంటలు నీట మునిగిపోయాయని, ఇప్పుడు ఏమి తెలియనట్టు అంబటి సోదరులు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. గత పొన్నూరు ఎమ్మెల్యే వెంచర్ వేసి, చెరువు మధ్య నుంచి రహదారి ఏర్పాటు చేయడం వల్లే నంబూరులో ఇళ్ల మధ్య వరద నీరు చేరిందన్నారు. వైసీపీ నాయకుల అక్రమాలను ప్రశ్నించామనే మాపై ఎస్సీ, ఎస్టీతో పాటు అనేక కేసులు పెట్టారని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ అమరావతిపై విషం గక్కిందుకే వరద, బురద రాజకీయాల చేస్తున్నారని మండిపడ్డారు. అంబటి మురళి అనే వ్యక్తి మోసానికి ప్రతి రూపమని, అందుకే ప్రభుత్వ స్థలంలో అపార్ట్‌మెంట్‌లను నిర్మించి అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. అంబటి సోదరులపై రాబోయే రోజుల్లో సాక్షాధారాలతో వారి బాగోతాలు సీరియల్ వారిగా బయట పెడతామని హెచ్చరించారు. కొండవీటి వాగు, పాలవాగు, చెల్లా వాగు ద్వారా వచ్చే వరద నీరు సజావుగానే వెళ్లిపోయాయని తెలిపారు. వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్.. ఓ ఆశాకిరణం

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్లను నమోదు చేసుకున్నాయి. 24 గంటల్లోనే బిజినెస్ స్టార్టప్‌ల కోసం 1,67,321 మంది రిజిస్ట్రేషన్లు జరిపించుకున్నారు.

స్టార్టప్‌లకు ఊతం

'స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా ఇన్నోవేషన్ హబ్‌లు పనిచేస్తాయి. యువతలోని వినూత్న ఆలోచనలను సరికొత్త ఆవిష్కరణల రూపంలో వెలికితీయడమే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ల లక్ష్యం.' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తోపాటు విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురంలో నెలకొల్పిన అనుబంధ కేంద్రాలను ఆయన బుధవారం టాటా గ్రూప్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఓ ఇన్నోవేషన్ హబ్ ఉండాలన్నదే తమ ఆశయమన్నారు. అగ్రిటెక్‌లో ఇన్నోవేషన్‌కు విస్తృతమైన అవకాశాలున్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లో అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే తన నినాదమన్నారు. ఈ లక్ష్య సాధన కోసమే రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓ వైపు సంపదను సృష్టిస్తూనే మరోవైపు పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పేదల జీవన ప్రమాణాలను మరింతగా మెరుగుపరుస్తూ వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గ్రామస్థాయి నుంచి ఆవిష్కరణలు

గ్రామాల నుంచి గ్లోబల్ స్థాయి వరకు అన్ని రంగాల్లో ఆవిష్కరణలు రావాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. యువత వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలను చేయగలిగితే యావత్ ప్రపంచమంతా వాటిని ఆదరించి తీరుతుందన్నారు. ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న తమ సంకల్పంలో ఇదో తొలిమెట్టని తెలిపారు. ఈ కార్యాలయ భవనం లక్షలాది యువతకొక ఆశాకిరణన్నారు. అమరావతిని హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే బాబు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టాటా గ్రూప్స్ చైర్మన్ చంద్రశేఖరన్, మంత్రులు నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్డ్ చైర్మన్ బాబాకల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్, ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు



గుంటూరు విద్య, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): యనమదలలో గల కిట్స్ అక్షర్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయ సుబ్బా రావు, సెక్రటరి కోయ శేఖర్ మాట్లాడుతూ యాజమాన్యంపై నమ్మకంతో మా కళాశాలను ఎంచుకున్న తల్లి తండ్రులు, విద్యార్థులకి అభినందనలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఇంజనీరింగ్ సిలబస్‌తో పాటు ఇన్నోవేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్, కోడింగ్, సాఫ్ట్‌స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామ కోటయ్య, డాక్టర్ జీ గురు కేశవదాసు, డాక్టర్ ఎస్‌కే కమరుద్దీన్, డాక్టర్ ఆర్ బుల్లిబాబు, డాక్టర్ కే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆర్ చినవెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాల కోసం ఈ నెల 26 లోగా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గుంటూరు, తెనాలి ప్రభుత్వ ఐటీఐలలో ఇందుకోసం నమోదు కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచామని తగిన సర్టిఫికెట్లతో పేరు నమోదు చేసి వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. 29న ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, 30వ తేదీన ప్రైవేట్ ఐటీఐలలో కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

'ఇన్నోవేషన్ హబ్'ను తిలకించిన ఆర్‌వీఆర్ విద్యార్థులు



హాజరైన విద్యార్థులు

గుంటూరు (విద్య) ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరిగిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవ ప్రసార కార్యక్రమాన్ని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం తిలకించారు. కళాశాలలో ప్రత్యక్ష ప్రసారం కోసం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని తిలకించాలని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ వెల్లడించారు. ప్రపంచ దేశాలను ఆకర్షించేలా, ఏపీని "ఇన్నోవేషన్ హబ్"గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేబడుతున్న కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్ అనే నినాదాన్ని విజయవంతం చేయడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కే రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

● పోస్టల్ సూపరింటెండెంట్ మొహమ్మద్ జాఫర్ సాధిక్



నరసరావుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ శాఖ నిర్వహించే దీన్‌దయాల్ స్పర్శ్ యోజన ద్వారా నిర్వహించే ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకానికి 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల ఎంపికకు పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ మొహమ్మద్ జాఫర్ సాధిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల పేర్లతో పాఠశాలల నుంచి పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ చిరునామాకు సెప్టెంబరు 16వ తేదీ లోపు పంపాలన్నారు. 30న వ్రాత పరీక్ష జరుగుతుందని, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి పెలాటలీ ప్రాజెక్టు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నెలకు రూ 500 చొప్పున ఏడాదికి రూ 6 వేలు ఉపకార వేతనాల రూపంలో అందజేస్తామన్నారు. విద్యార్థులు మంచి అకాడమిక్ రికార్డ్ కలిగి, ఫిలాటలీని హాబీగా చేస్తూ, పోస్టల్ సర్కిల్ ద్వారా నిర్వహించబడే ఫిలాటలీ క్విజ్, ఫిలాటలీ ప్రాజెక్టుల ఆధారంగా స్కాలర్‌షిప్ పొందవచ్చు అన్నారు. ఎంపికప్రక్రియ రెండు దశలలో ఉంటుందన్నారు. లెవెల్-1 ఫిలాటలీ క్విజ్ పోస్టల్ అథారిటీల ద్వారా ఫిలాటలీ క్విజ్ నిర్వహించ బడుతుం దన్నారు. ఇది రెండవ స్థాయికి స్క్రీనింగ్ పరీక్షగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ ఇండియాపోస్ట్ డాట్ జీవోవీ డాట్ ఇన్‌లో సంప్రదించాలన్నారు.

48,853 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,349 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,853 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,212 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	13300
273	---	----
341	10000	14600
4884	----	----
సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
షార్క్-1	-----	----
బ్యాడిగి 355	10000	13500
దేవనూరు డీలక్స్	10000	13300
ఆర్మూరు	9800	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13400
నెంబరు. 5	10000	13500
273	----	----
341	11000	15000
4884	10000	12800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14400
బ్యాడిగి 355	10000	13000
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	----	---
తాలుకాయలు	5000	7300

బాలిక హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో బాలిక హత్య కేసులో నిందితుడు నరమామిడి నాగరాజుకు గుంటూరు నాలుగవ అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు యావజ్జీవ శిక్ష, రూ. 1100 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు విలువరించింది. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం 2024 జూలై 15వ తేదీన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో బాలిక (13) కిడ్నాప్, హత్య కేసు నమోదయింది. ఈ కేసులో అనుమానితుడిగా కొత్త రెడ్డిపాలెంలో నివాసం ఉంటున్న కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన నరమామిడి నాగరాజును పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణలో డీఎస్పీ బీ జనార్ధన్ రావు సహకారంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నాగరాజు బాలిక తల్లి ఎస్తేర్ రాణితో అక్రమ సంబంధం పెట్టుకొని ఆ సంబంధం బెడిసి కొట్టిన నేపథ్యంలో ప్రతీకార భావంతో బాలికను హత్య చేసినట్లు పోలీసులు సాక్షాధారాలతో సహా గుర్తించారు. ఎట్టకేలకు నిందితుడిని రూరల్ సీఐ కోటేశ్వరరావు చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణ అరెస్టు చేసి గుంటూరు నాలుగవ అదనపు జూనియర్ జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు ముందు హాజరు పరిచారు. ఈ కేసుపై త్వరితగతిన విచారణ చేపట్టిన అదనపు జిల్లా జడ్జి శరత్‌బాబు, స్పెషల్ పీపీ షేక్ ముబీనా బేగ్, కోర్టు కేసుల పర్యవేక్షణ అధికారి సీఐ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ శేష్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ నిర్మల జ్యోతి విచారణ అధికారులుగా వ్యవహరించారు. నిందితుడికి యావజ్జీవ కఠిన గారాగార శిక్ష పడేలా సాక్షాదారాలు సేకరించిన పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణను ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

అతివేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● వ్యక్తి మృతి... మరో నలుగురికి తీవ్ర గాయాలు



మృతి చెందిన దొడ్డా శ్రీను

దాచేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అతి వేగంగా ప్రయాణం చేస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కగా నిలిపి ఉన్న ఆటోను కూడా ఢీకొంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం పై ప్రయాణం చేస్తున్న దొడ్డా శ్రీను(30) తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి గుంటూరు వైపుకు వెళ్తున్న కారు దాచేపల్లి నుంచి స్వగ్రామం గామాలపాడుకి వెళుతున్న దొడ్డా శ్రీను, అతని సోదరుడు దొడ్డా సైదులుల ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. వాహనాన్ని నడుపుతున్న సైదులు ఎగిరి రోడ్డు పై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలై తీవ్ర రక్త స్రావం జరిగింది. స్థానికులు స్థానిక ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం పిడుగురాళ్ళ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్ర వాహనం పై వెనుక వైపు ఉన్న మృతుడి సోదరుడు సైదులకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు రోడ్డు పక్కనే ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న డ్రైవర్ తోటకూర రాధాకృష్ణ, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనుకు భార్య సంధ్య, సంవత్సరం, మూడు సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు దొడ్డా శ్రీను మరణ వార్త తెలుసుకున్న టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, జడ్పీటీసీ జంగా కోటయ్య, సర్పంచ్ సురేష్ సంతాపాన్ని తెలిపారు.

వైసీపీ నాయకుడు అంబటి మురళిపై పోలీసులకు ఫిర్యాదు

పెదకాకాని, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గ వైసీపీ నాయకుడు అంబటి మురళి పై చర్యలు తీసుకోవాలని పెదకాకాని పోలీసులకు మండల రైతులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.... అమరావతి కోసం పొన్నూరు నియోజకవర్గంలో 72,000 ఎకరాల పంట పొలాలను ముంచేశారని, కొండవీటి వాగు వరదలు మళ్ళించి పొన్నూరులో రైతుల పంట పొలాలు ముంచి తీవ్ర నష్టం చేకూర్చారని వైసీపీ నాయకులు అంబటి మురళీకృష్ణ చేసినవి నిరాధారమైన అసత్య ఆరోపణలు అని తెలిపారు. దీని వల్లన మా ప్రాంత రైతుల ప్రతిష్టకు మచ్చ తెచ్చే విధంగా ఉన్నదని అన్నారు. ఇలాంటి ఆరోపణలు చేసిన అంబటి మురళీకృష్ణ పై కఠిన చర్యలు తీసుకోవాలని పెదకాకాని మండల రైతులు, టీడీపీ పెదకాకాని మండల నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం పెదకాకాని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గత సోమవారం గ్రీవెన్స్‌లో వైసీపీ మండల నాయకులు అసత్యమైన ఫిర్యాదు చేశారని ఆరోపించారు.

ఆందోళన విరమించిన బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగి

తెనాలి అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గత పది రోజులుగా ఆందోళన చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి పద్మావతి బుధవారం విరమించారు. వినియోగదారుల సేవా కేంద్రాన్ని ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసనగా సాలిపేటలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద ఆమె ఆందోళన చేపట్టారు. స్థానిక అధికారులు నచ్చజెప్పినప్పటికీ ఆందోళన విరమించకపోవడంతో ఆమె ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బీఎస్ఎన్ఎల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, పున్నారావు ఆమెకు నచ్చజెప్పారు. జోనల్ మేనేజర్‌తో మాట్లాడించి ప్రైవేటీకరణ అంశం విధానపరమైన నిర్ణయం కాబట్టి ఆందోళన విరమించాలన్నారు. దీంతో ఆమె ఆందోళన విరమించారు.

ఆయుష్ లైసెన్సుల రెన్యువల్‌కు ప్రత్యేక మేళాలు

గుంటూరు మెడికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల నిర్వహణ రెన్యువల్స్ కోసం ఆయుష్ శాఖ తొలిసారిగా ప్రత్యేక మేళాలను రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్లు ఆయుష్ శాఖ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాల్లో ఆయుష్ శాఖ అడిషనల్ డైరెక్టర్లు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, సహాయక సిబ్బంది హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటి, రెండు తేదీల్లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఓల్డ్ రిమ్స్ హాస్పిటల్, గవర్నమెంట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్, ప్రకాశం భవన్ ఎదురుగా, ఒంగోలు చిరునామాకు హాజరుకావాలని ఆయుష్ శాఖ డైరెక్టర్ కోరారు. లైసెన్స్‌లు రెన్యువల్ చేయడంతో పాటు వారివారి సమస్యల పరిష్కారం కోసం ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

నగరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగస్టు 20 నుండి ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో వివిధ హానర్స్‌కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అందులో బీఎస్సీ హానర్స్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ జువాలజీ, కంప్యూటర్ సైన్స్, ఆక్వాకల్చర్, ఎలక్ట్రానిక్స్, బీఏ హానర్స్ పొలిటికల్ సైన్స్, బీకాం హానర్స్, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నామని వివరించారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ కోరారు.

వరినారుకు పెరిగిన డిమాండ్



కర్లపాలెంలో వరినారుమడి

కర్లపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భారీవర్షాలు కురవటంతో నియోజకవర్గంలోని వెదపెట్టిన వరిపైర్లన్నీ నీటమునిగాయి. దీంతో వెద వరి పాడైపోయింది. ప్రస్తుతం రైతు తమ పొలాల్లో వరి నాటుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటంతో మెరకభూముల్లో నారుమడులు పోసిన రైతులకు డిమాండ్ పెరిగింది. మండలంలోని పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం, కర్లపాలెం, నల్లమోతువారిపాలెం ప్రాంతాల్లో వరినారుమడులు పోయగా సెంటు వరినారు 1600 నుంచి 2000 వరకు విక్రయిస్తున్నారు. రైతులకు వరినారు దొరకపోవటంతో గత్యంతరం లేని స్థితిలో అవసరానికి అనుగుణంగా 2 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

దివ్యాంగురాలి స్టేట్‌మెంట్ రికార్డు

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కారంచేడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన యువతిపై విచక్షణ రహితంగా దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దివ్యాంగులహక్కుల పోరాటసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా రామయ్య డిమాండ్ చేశారు. వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాలలో స్టేట్‌మెంట్ రికార్డు చేసుకునేందుకు బాధిత యువతితో కలిసి పోలీసులు బుధవారం వచ్చారు. ప్రజాసంఘాల నాయకులతో కలిసి చల్లా రామయ్య అక్కడకు వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, రాజు, దయాశీలం తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహాలపై దాడి

● మహిళలు, నిర్వాహకుల అరెస్టు

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వ్యభిచార గృహాలపై పట్టణ సీఐ ఆర్ రాంబాబు బుధవారం దాడులు నిర్వహించారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలో వివేకానందకాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావటంతో దాడి చేసి ముగ్గురు మహిళలు, ఒక విటుడు, నిర్వహకురాలను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా ప్యాడిసన్‌పేటలో నిర్వహకురాలితోపాటు మరో మహిళను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి స్టూవర్టుపురంనకు చెందినవారు ఇక్కడ వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్ఐలు విజయ్‌కుమార్, చంద్రావతి, సిబ్బంది మనోజ్, పోతురాజు, కాటంరాజు, రవికుమారి పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న కార్యదర్శులకు ఘనసత్కారం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వహించే మండల, సచివాలయ ఉద్యోగులకు సమాజంలో ఎనలేని గౌరవం దక్కుతుందని పిట్టలవానిపాలెం మండల ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు అన్నారు. పిట్టలవానిపాలెం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్లో గురువారం ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ కార్యదర్శులు షేక్ రబ్బానీ, సువర్చల, కె.శ్రీనివాసరావు, కొండా గోపీకృష్ణలను నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శులు, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని 14గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులు, మండలపరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలి

● వ్యవసాయాధికారి కె.శారద

బాపట్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పొలం కౌలుకు తీసుకొని సాగుచేసే ప్రతిరైతు తప్పనిసరిగా కౌలురైతు కార్డు తీసుకోవాలని వ్యవసాయాధికారి కె.శారద తెలిపారు. మండలంలోని బేతపూడి, వెదుళ్ళపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఎకరానికి 20కిలోల జింకు వేయాలని తెలిపారు. జింకులోపం ఉంటే పైరు ఎదుగుదల లోపిస్తుందన్నారు. కావున తప్పనిసరిగా జింకు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలులో పొలం పిలుస్తోంది

భట్టిప్రోలు(కొల్లూరు) ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మారెడ్డి నిర్వహించారు. క్షేత్రస్థాయిలో నారుమళ్లు, వెదనాట్లు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

అసంపూర్ణంగా ఆరోగ్యకేంద్ర భవనం

● మౌలికవసతులు మరిచారు
● ఐదేళ్ళు గడుస్తున్న పూర్తికాని తీరు

రేపల్లె, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేదలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు పట్టణ ఆరోగ్యకేంద్రం 2021 జూలై 4వ తేదీన పట్టణ ఆరోగ్యకేంద్రానికి శంకుస్థాపన చేశారు. నేటికి భవనం నిర్మాణం పూర్తయిందే తప్ప మౌలిక వసతులు కల్పించడంలో ప్రజారోగ్యశాఖ నిర్లక్ష్యం వహిస్తుంది. నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.99.95 లక్షలు నిధులు మంజూరు చేశారు. భవనం నిర్మించారా కానీ మౌలిక వసతులు కల్పించిన దాఖలాలు లేవు. భవనానికి తలుపులు, ఫ్లోరింగ్, విద్యుత్, నీటి సరఫరా, ఫ్యాన్లు వంటివి చేపట్టకపోవటంతో భవనం మధ్యంతరంలోనే పనులు ఆగిపోయాయి. దీనికి సంబంధించిన ఆరోగ్యకేంద్రం పట్టణంలోని 13వవార్డులో ఓ అద్దె భవనంలో వేలాది రూపాయలు ఇచ్చి కొనసాగుతుంది. ప్రభుత్వం నిధులు మంజూరుచేసిన ప్రజారోగ్యకేంద్ర భవనాన్ని నిర్మించటంలో వైద్యాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు దృష్టిసారించి భవనానికి పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



ఉప్పూడిరోడ్డులో అసంపూర్తిగా ఉన్న పట్టణ ఆరోగ్యకేంద్రం



ఆరోగ్యకేంద్రంలో కనీసం తలుపులు, ఫ్లోరింగ్, విద్యుత్ ఏర్పాటు చేయ్యనివైనం

9 పనులకు రూ.162.50 కోట్లతో ప్రతిపాదనలు

● నిధులకు కొరత లేదు.. సకాలంలో పనులు పూర్తి చేయాలి
● సమీక్షలో ఎమ్మెల్యే ఆనందబాబు



ఆర్అండ్‌బీ శాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధి ప్రజల సౌకర్యార్థం ఆర్ అండ్ బీ శాఖ ద్వారా రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయింపు విషయంపై ముఖ్యమంత్రితో చర్చించి విడుదలకు కృషి చేస్తామని చేపట్టే పనులను సకాలంలో పూర్తి చేసే బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్అండ్‌బీ శాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల మరమ్మతులకు కేటాయించిన నిధులు ఇంతవరకు పూర్తి చేసిన పనుల వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో మరమ్మతుల నిమిత్తంగా 20 పనులకు రూ.5 కోట్లు కేటాయించామని పనులు ప్రారంభించి చివరి దశలో ఉన్నట్లు అధికారులు వివరించారు. అమృతలూరు, చుండూరు మండలాల పరిధిలో రూ.3 కోట్లతో చేపట్టిన 13 పనుల్లో ఒక పని మాత్రమే పూర్తి కాలేదని వివరించారు. దీనిపై ఆగ్రహించిన ఎమ్మెల్యే సంబంధించిన కాంట్రాక్టర్‌ను వెంటనే తొలగించి వేరే కాంట్రాక్టర్‌తో పని పూర్తి చేయించాలని ఆదేశించారు. ఐదు మండలాల పరిధిలో మేజర్ పనులపై అంచనాలతో కూడిన ప్రతిపాదనలను అధికారులు అందించారు. వాటిలో 9 పనులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. రావికంపాడు నుంచి అబ్బనగూడవల్లి వరకు 8 కి.మీ రోడ్డు మార్గం రూ.5 కోట్లు కొల్లూరు నుంచి కొల్లిపర వరకు 6 కి.మీలకు రూ.2 కోట్లు, ఓలేరు నుంచి పెసర్లంక వరకు 4 కి.మీ మార్గానికి రూ.2 కోట్లు, కొల్లూరు లాకుల వద్ద నుంచి మూడు బ్రిడ్జిల నిర్మాణం 300 మీటర్ల విడిది కలిగిన రోడ్డు మార్గం లాకులు ఏర్పాటు, కెనాల్ లైనింగ్ నిర్మాణాల నిమిత్తంగా రూ.15 కోట్లు, తెనాలి నుంచి చందోలు వరకు 17 కి.మీ రోడ్డుకు రూ.50 కోట్లు కూచిపూడి నుంచి గోవాడకు ఎనిమిదిన్నద కి.మీ రోడ్డుకు రూ.30 కోట్లు, బ్రాహ్మణ కోడూరు నుంచి భట్టిప్రోలు రేపల్లె మార్గానికి 19 కి.మీ రూ.50 కోట్లు, తొట్టెంపూడి తురుమెళ్ల రోడ్డు మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.50 కోట్లు వెరశి రూ.162.50 కోట్లు ఖర్చు అవుతాయని అంచనాలతో కూడిన ప్రతిపాదనలు అధికారులు వివరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధించిన నిధులను ముఖ్యమంత్రి సహకారంతో త్వరలో మంజూరు చేయిస్తానని చెప్పారు. సమావేశంలో రేపల్లె డీఈ రాజేష్, బాపట్ల డీఈ అరుణకుమారి, అమృతలూరు, కొల్లూరు సర్కిల్స్ ఏఈలు శ్రీకాంత్, విద్యాసాగర్, కాంట్రాక్టర్లు హాజరయ్యారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్ఐ

కొల్లూరు ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్ఐ జానకి అమరవర్ధన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే వారంతా కమిటీగా ఏర్పడి అన్ని శాఖల నుంచి విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు పొందాలన్నారు. విగ్రహాల వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో వివాదాలు, ఘర్షణలకు తావు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనని ఎస్ఐ తెలిపారు.

● రేపల్లె, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం సర్కిల్‌పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి పండుగను నిర్వహించే కమిటీలు ముందస్తుగానే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అడవులదీవి ఎస్ఐ బాబూరావు కోరారు. కమిటీల వారు వినాయకచవితి పందిళ్ళు ఎక్కడ ఏర్పాటు చేసే విషయం నిమజ్జనం చేసే స్థలం, నిమజ్జనానికి నిర్వహించే వెహికల్ నెంబర్, డ్రైవర్ లైసెన్స్ తప్పనిసరిగా జత చేసి పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు.

బాలికలకు శక్తి యాప్ రక్షణ కవచం లాంటిది



శక్తి యాప్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

వేమూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బాలికలకు శక్తి యాప్ ఒక రక్షణ కవచం లాంటిదని ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని కుచ్చెళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వారి రక్షణ కోసం శక్తి యాప్ రూపొందించారన్నారు. పాఠశాలల బాలికలకు దీనిపై అవగాహన అవసరమన్నారు. దాని ప్రాముఖ్యాన్ని ఏ విధంగా ఉపయోగించాలి అనే విషయాలపై అవగాహన కల్పిస్తూ కొన్ని అంశాలను వివరించారు. ఆపదలో ఉన్నప్పుడు భయపడకుండా ధైర్యంగా ఏ విధంగా ఎదుర్కోవాల్లో తెలిపారు. ఏదైనా ప్రమాదలో పడ్డప్పుడు కేవలం ఒక్క బటన్ నొక్కడం ద్వారా వెంటనే పోలీసుల సహాయం పొందవచ్చన్నారు. ఈ యాప్ వినియోగదారుల జీపీఎస్ స్థానాన్ని గుర్తించి సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం పంపుతుందన్నారు. లైంగిక వేధింపులు, ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు నిర్భయంగా వెంటనే ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వవచ్చాన్నారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ప్రతి విద్యార్థిని ఫోన్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని దానిని ఎలా ఉపయోగించాలో నేర్చుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి-2 పి.అంకారావు మాట్లాడుతూ శక్తి యాప్‌పై అవగాహన కల్పించడం చాలా ఉపయోగకరమన్నారు. ఉపాధ్యాయులు వాసుదేవరావు, రవిశంకర్ తదితరులు ప్రసంగించారు. పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● కొల్లూరు ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంగా పని చేస్తుందని ఎస్ఐ జానకి అమరవర్ధన్ పేర్కొన్నారు. బుధవారం కొల్లూరులోని సాయి వాసవీ విద్యా సంస్థల్లో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా సంస్థ కరస్పాండెంట్ ఉప్పు శ్రీనివాసరావు, పీఎస్ఐ భార్గవ్, పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో బాపట్ల విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి అబాకస్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో యూసిమాస్ సంస్థ ప్రతినిధులు

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో బాపట్ల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాలు నుంచి 4వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈపోటీలలో బాపట్ల నుండి యూసిమాస్ విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈపోటీలలో మంతెన కృతిక్ జాతీయ స్థాయిలో 4వస్థానం కైవసం చేసుకోగా దర్శిచేతన, శేష అర్హాహి, బమిడిపల్లి శ్రీవైష్ణవిలు 6వస్థానంలో నిలిచి మెరిట్‌టోపీలను కైవసం చేసుకొని బాపట్ల పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టారని సంస్థ డైరెక్టర్లు వనమా స్మైలీ, బొనిగల రాజేంద్రప్రసాద్‌లు తెలిపారు. సందర్భంగా బుధవారం ట్రోఫీలు అందుకున్న విద్యార్థులను అభినందించారు.

సాంకేతిక విప్లవానికి నాంది పలికిన రాజీవ్‌గాంధీ

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వేమూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు తెలియజేశారు. బుధవారం మండలంలోని చావలి గ్రామంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాడికొండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్‌గాంధీ చొరవతో గ్రామ పంచాయితీలకు కేంద్రం నిధులు నేరుగా అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. దేశంలో సాంకేతిక పరిజ్ఞానానికి పునాది వేసిన రాజీవ్‌గాంధీ దేశ ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ బూరుగ సుబ్బారావు, చుండూరు జాషువా, బేతాళ సుందరరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో సాంకేతిక పరిజ్ఞానానికి నాంది పలికిన ఆధునిక భారత స్ఫూర్తి ప్రదాత, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పాతబస్టాండ్ కూడలిలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన బాటలు వేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరు పయనించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు దోనేపూడి రవి, మండల అధ్యక్షుడు మేడిబోయిన గిరి, గోళ్ళమూడి కిరణ్‌కుమార్, పి.సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్యులు

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మాపప్‌డే సందర్భంగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్ నందు డాక్టర్ లలిత రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆల్బెండ్‌జోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ లలిత రాజేశ్వరి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో ఎదుగుదల సరిగ్గా ఉండదని వేసుకోవటం వల్ల రక్తహీనతను నివారించవచ్చునని చెప్పారు. అపరిశుభ్రమైన చేతులతో మనం ఏదైన తిన్నప్పుడు నులిపురుగులు చేరుతాయన్నారు. కాబట్టి ప్రతిఒక్కరు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజేశ్వరి, బి.మరియమ్మ, సి.హెచ్‌వో నాగేశ్వరరావు, కోట బాబు, సుధారాణి, ఏఎన్ఎం రూత్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో 5,850ర్యాంకు సాధించిన హేమంత్

రేపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన న్యాయవాది దివి శ్రీనివాస్‌కుమార్, అనంత శైలజ కుమారుడు దివి శ్రీసాయిహేమంత్ ఆలిండియా నీట్‌ఎగ్జామ్‌లో 5,850ర్యాంక్ సాధించాడు. 2024లో ఎంబీబీఎస్ కాటూరి మెడికల్ కాలేజీలో పూర్తిచేశాడు. ఈ విద్యార్థిని పలువురు అభినందించారు.

జగన్ చట్ట వ్యతిరేక పాలనకు సుప్రీంకోర్టు వ్యాఖ్యలే నిదర్శనం

● సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సునీత దంపతులు, సీబీఐ అధికారి రామ్‌సింగ్‌పై వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదుతో వైసీపీ పాలనలో రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేయటాన్ని చట్ట దుర్వినియోగంగా సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ కొట్టివేయటం అప్పటి అరాచకపాలనకు నిదర్శనమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. ఈ కేసుపై సీబీఐ విచారణ కోరినా ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యాక దానిని ఉపసంహరించుకున్నారన్నారు. సునీత కోర్టుకు వెళ్ళి పోరాడి సీబీఐ విచారణను సాధించిందన్నారు. అయిన సీబీఐ అధికారులు, సునీత దంపతులు వేధింపులకు గురై విచారణ సక్రమంగా జరగనీ పరిస్థితులు సృష్టించబడ్డాయన్నారు. సునీత దంపతులే ఆస్తి కోసం వివేకాను హత్య చేయించారని కేసు మోపారన్నారు. 6సంవత్సరాలకు పైగా హత్య కేసు విచారణ జరుగుతున్న దేశంలోనే అత్యున్నత నేరపరిశోధక సంస్థ అయిన సీబీఐ విచారణ జరిపిన అసలు కుట్రదారుల పేర్లు వెల్లడికాకపోవటం వెనుక ఉన్న చీకటి కోణాలు బయటకు రావాలని కొల్లా పేర్కొన్నారు.

డ్రెయినేజి పూడిక తీత పనుల పరిశీలన



డ్రెయిన్లలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

బాపట్లరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అడవిగ్రామపంచాయతీ పరిధిలోని రామనగర్ కాలనీలో ఉన్న డ్రెయినేజి పూడిక తీతపనులను గ్రామపంచాయతీ అధికారులు నిర్వహించగా బుధవారం బాపట్ల డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ పరిశీలించారు. గ్రామంలోని డ్రెయినేజి, వర్షపునీరు నిల్వ ఉండకుండా ప్రొక్లెయిన్‌ల సాయంతో పూడిక తీతపనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో అడవి గ్రామపంచాయతీ కార్యదర్శి పి.పార్థసారధి, పంచాయతీ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ముప్పు నుంచి యువతను కాపాడుకుందాం

● ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ ముప్పు నుంచి యువతను కాపాడుకుందామని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో బుధవారం మత్తుపదార్థాల నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మత్తుపదార్థాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మత్తుపదార్థాల నియంత్రణ, నివారణ చర్యలపై సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలీసు, ఎక్సైజ్‌శాఖలతోపాటు హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్ వంటి విభాగాలు కూడా చురుకుగా పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్కూల్, కాలేజీల్లో జాగృతి సదస్సులు నిర్వహించాలన్నారు. మత్తుపదార్థాల వ్యాప్తిని అరికట్టటంలో సామాజిక, స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమన్నారు. గుంటూరు ఇంటలిజెన్స్ బ్యూరో అదనపు ఎస్పీ బి.ఫణిరాజుశర్మ మాట్లాడుతూ ట్రైన్‌లు, బస్టాండ్‌లు, పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, గంజాయి తరలింపు, సరఫరాపై నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. ఇతర రాష్ట్రాలు నుంచి వచ్చే వలసలపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మీ, మేజిస్టీరియల్ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, క్రైమ్ డీఎస్పీ జగదీష్‌నాయక్, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి జె.రాజాదెబోరా, మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించారు

● పునఃపరిశీలన చేసి పునరుద్ధరించాలని వినతి



మైనేని మురళీ సమక్షంలో శరీరవైకల్యాన్ని ఎంపీడీవోకు చూపుతున్న దివ్యాంగ వ్యక్తి

కొల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న దివ్యాంగుల పింఛన్లు సైతం తొలగించారని, పునఃపరిశీలన చేయించి పింఛన్ పునరుద్ధరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఎంపీడీవో కె.నరసింహారావుకు విన్నవించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తనను ఆశ్రయించిన దివ్యాంగులతో కలిసి ఎంపీడీవోను సంప్రదించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు తమకున్న అంగవైకల్యాన్ని ఆయన ముందు చూపించారు. పింఛన్ల తొలగింపుపై మైనేని మాట్లాడుతూ దివ్యాంగ నిర్ధారణ పరీక్షల్లో పారదర్శకత లోపించడం వల్లే మండలంలో 193 పింఛన్లు తొలగించారని, వీరిలో చాలా మంది అర్హులు ఉన్నారన్నారు. 16 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న అర్హులైన దివ్యాంగులకు సంబంధించిన పింఛన్ల తొలగింపుపై డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా మళ్లీ అర్జీలు స్వీకరించి పారదర్శకంగా పరిశీలించి పింఛన్ అందించాలని ఎంపీడీవోను మైనేని కోరారు. తోకలవానిపాలెం సర్పంచ్ టి.కృష్ణమోహన్ కూడా అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు.

విద్యుత్ అక్రమంగా వాడుతున్న వారిపై చర్యలు

● రూ.3.33లక్షల జరిమానా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి

రేపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను అక్రమంగా వాడినా, అధికలోడు వాడినా వారిపై చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి తెలిపారు. బుధవారం రేపల్లె పట్టణంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఇన్‌సెంటివ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 124మంది విద్యుత్‌సిబ్బందితో 6,099సర్వీస్‌లు తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో 50మంది విద్యుత్ వినియోగదారులు అధికలోడు వాడుతున్నట్లు గుర్తించి రూ.3.33లక్షలు జరిమాన విధించామన్నారు. ముగ్గురు వినియోగదారులు విద్యుత్ అనాధికారికంగా వాడటాన్ని గుర్తించి రూ.33వేలు జరిమాన వేశామన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు సీహెచ్ వెంకటేశ్వరావు, డి.శ్యామ్‌సుధాకర్‌బాబు, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● దోమల నివారణకు కృషి చేయాలి : మున్సిపల్ కమిషనర్



దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది

రేపల్లె, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచటం వల్ల దోమల వ్యాప్తిని నియంత్రించవచ్చని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహల మధ్య శుభ్రంగా ఉంటే దోమల వల్ల సంక్రమించే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, వైద్యులు సముద్రాల రమేష్, షేక్‌నాతిక్, షేక్ షాహీన్, శానిటరీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ

కొల్లూరు ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల నివారణ దినోత్సవ ర్యాలీని వైద్యురాలు కావ్య నిర్వహించారు. బుధవారం కొల్లూరులోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యురాలు, సిబ్బంది జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ అవగాహన ర్యాలీని గ్రామ పురవీధుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ, దోమల నివారణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మి, దేవి, సూపర్‌వైజర్ హరిబాబు, కళ్యాణ్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి

● వ్యవసాయ విస్తరణాధికారి సీహెచ్ సుదర్శనరావు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయాధికారుల సలహలను సూచనలను పాటించి తగిన మోతాదులో పొలంలో ఎరువులను వాడుకోవాలని మండల విస్తరణాధికారి సుదర్శనరావు అన్నారు. మండలంలోని రైతు సేవాకేంద్రం నందు గురువారం ఆయా ప్రాంతాలకు చెందిన రైతులకు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పలుసూచనలు, సలహాలు ఆయన అందజేశారు. కార్యక్రమంలో అల్లూరి పీఏసీఎస్ అధ్యక్షుడు పెనుమెత్స వెంకటసత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.




అరవింద వారధి వద్ద కృష్ణమ్మ పరవళ్లు

- లోతట్టు ప్రాంతాల్లో పంటల మునక
- కాజ్‌వేలపై ప్రవహిస్తున్న వరద నీరు
- వరద పొంచి ఉంది.. జాగ్రత్తని హెచ్చరికలు

శాంతించిన కృష్ణమ్మ



పోతార్లంక వద్ద అరటి తోటలో చేరిన వరద నీరు



గాజుల్లంక వద్ద కంద పంటలో వరద నీరు

భట్టిప్రోలు, కొల్లూరు ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా లంక గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన కృష్ణమ్మ శాంతించింది. క్రమేపి నదిలో వరద ఉధృతి బుధవారం సాయంత్రానికి కొంతమేరకు తగ్గింది. అయితే కొల్లూరు మండలం దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న పోతార్లంక చప్టాపై, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వద్ద ఉన్న చప్టాపైన వరద నీరు ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు రాకపోకలను నిలిపి వేశారు. పెదల్లంక, చింతమోటు, పెసర్లంక గ్రామాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాలు, కొల్లూరు మండలంలోని ఆవులవారిపాలెం, పెసర్లంక, గాజుల్లంక, పోతార్లంక, చింతల్లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వేసిన వాణిజ్య పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఇటుక బట్టీలను నీరు చుట్టుముట్టింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటితో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని నదీ తీర లోతట్టు ప్రాంతాల భూముల్లోని అరటి, కంద, పసుపు, కూరగాయ పంటలు ముంపునకు గురయ్యాయి. మళ్లీ నదిలో వరద పెరిగే అవకాశాలు లేకపోలేదని అధికారులు చెబుతున్నారు. వినాయక చవితి వెళ్లే వరకు వరద కొనసాగుతూనే ఉంటుందని ప్రజలు ఎవరూ నదిలోకి దిగరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతన్నల్లో భయాందోళనలు

రేపల్లె: మూడురోజులుగా వరదనీరు పోటెత్తడంతో నదీ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలతో నదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇంకో రెండు, మూడు లక్షల క్యూసెక్కుల నీరు వస్తే గ్రామాలు, పొలాలు, రొయ్యల చెరువులు మునిగిపోయే పరిస్థితి ఉందంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓలేరు, రావిఅనంతవతరం సమీపంలో ఉన్న లోతట్టుప్రాంతాల్లో నీరు చేరింది. వరద ఉధృతంగా వస్తే రొయ్యలు నీటి పాలవుతాయని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



విద్యార్థులను బొమ్మల పేర్లను అడుగుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అంగన్‌వాడీ, పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

దాచేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం రామ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్ కేంద్రాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కొద్దిసేపు ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పలు బొమ్మలు చూపుతూ ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం రామ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన మెనూను, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో రికార్డులను, గదులను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఈవో చంద్రకళ, ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఎంపీడీవో వీరయ్య, డీటీ బ్రహ్మయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి, శ్రీలక్ష్మి, కార్యకర్త విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

చేనేత, హస్తకళలను ప్రోత్సహించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని ఏపీ హస్తకళల అభివృద్ధి ఛైర్‌పర్సన్ చేరెడ్డి మంజులా రెడ్డి అన్నారు. ఇన్నర్ రింగు రోడ్డులోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన చేనేత ఎక్స్‌పోను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో 60 స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా కళాకారుల నుంచి కొనుగోలు చేసేందుకు ఈ ప్రదర్శన నిర్వహిస్తునట్టు చెప్పారు. ఈ ప్రదర్శన సెప్టెంబరు 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. చేనేత కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ జనాబ్ షేక్ హసన్ బాషా, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు, జిల్లా టూరిజం అధికారి శ్రీ రమ్య, స్థానిక కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మిత పద్మజ తదితరులు పాల్గొన్నారు.



చేనేత ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న చేరెడ్డి మంజులా రెడ్డి

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

- 70 గేట్లు పూర్తిగా ఎత్తివేత
- దిగువకు 4,56,400 క్యూసెక్కులు
- డెల్టా కాలువలకు 10,641 క్యూసెక్కులు
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక




తాడేపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుండి బుధవారం రాత్రి వరకు 4లక్షల 67వేల 41 క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4 లక్షల 56 వేల 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాలువకు 7 వేల 135 క్యూసె క్కులు, పశ్చిమ డెల్టాకు 3 వేల 506 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు ఛానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నందున దిగువ నదీ తీర ప్రాంత వాసులు లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

టెయిల్‌పాండ్‌కు 4,47,664 క్యూసెక్కులు..

రెంటచింతల,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 10 గేట్లను 5 మీటర్లు,9 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి దిగువన వున్న పులిచింతలకు 4,51,863 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ,ఈఈ నాగరాజులు చెప్పారు.బుధవారం సాయంత్రం 6 గంటల వరకు ఎగువన వున్న నాగార్జునసాగర్ నుంచి 4,47,664 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.రిజర్వాయర్‌లో 74.02(పూర్తిస్థాయి 75.50) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.0957(పూర్తిస్థాయి 7.080 టీఎంసీలు)టీఎంసీలకు సమానం.టీఆర్‌సీ(టేల్ రేస్ ఛానల్) లెవల్ 64.01గా వుందన్నారు.విద్యుదుత్పత్తి పూర్తిగా నిలిపి వేశామన్నారు.అయితే ఈ నెల రోజుల వ్యవధిలో 23.2856 ఎంయుల(మిలియన్ యూనిట్లు) విద్యుత్‌ను ఉత్పత్తి చేశామన్నారు.



19 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



పులిచింతలకు వస్తున్న భారీ వరద

అచ్చంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. బుధవారం నాలుగు లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు కృష్ణా నదికి వస్తుండటంతో నదీతీర గ్రామాలను మండల తహసీల్దార్ కే శ్రీనివాసరావు బుధవారం అప్రమత్తం చేశారు. పులిచింతల ప్రాజెక్టులో 32.25 టీఎంసీల నీటి నిల్వ ఉండగా ఎగువ నుంచి 4,27,580 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నాయి. ప్రాజెక్టు వద్ద 15 గేట్లను 4.5 మీటర్ల మేరకు ఎత్తి 4,63,165 క్యూసెక్కుల నీరు, పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 4,80,165 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే ఉపాధ్యాయులకు కనీసం పది సంవత్సరాలు సర్వీస్ ఉండాలని, ఎటువంటి క్రిమినల్, సివిల్ కేసుల నేరారోపణలు ఉండరాదని స్పష్టం చేశారు. ఆరోపణలు లేనట్లు ప్రత్యేకంగా ధృవీకరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయాలు, ఉర్దూ ఉపాధ్యాయులు ఉర్దూ రేంజి కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

గుంటూరు మీదగా సంత్రగచి, యశ్వంత్‌పూర్‌లకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా సంత్రగచి, యశ్వంత్‌పూర్‌లకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్‌ఎం సుదేష్ణ సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 02863 సంత్రగచి - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు సెప్టెంబరు 4, 11, 18(గురువారం) మధ్యాహ్నం 12.50కి బయలుదేరి శుక్రవారం సాయంత్రం 8.25కి గుంటూరు, 9.06కి నరసరావుపేట, అర్ధరాత్రి దాటాక (శనివారం) 12.55కి యశ్వంత్‌పూర్ చేరుకొంటుంది. నంబరు. 02864 యశ్వంత్‌పూర్ - సంత్రగచి స్పెషల్ సెప్టెంబరు 6, 13, 20 తేదీల్లో(శనివారం) వేకువజామున 4.30కి బయలుదేరి సాయంత్రం 3.29కి నరసరావుపేట, 5.25కి గుంటూరు, ఆదివారం మధ్యాహ్నం 1.25కి సంత్రగచి చేరుకొంటుందన్నారు.


ఎన్నికల్లో పోటీ చేయని రెండు పార్టీలకు కలెక్టర్ షోకాజ్ నోటీసు

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 2019 నుంచి వరుసగా ఆరు సంవత్సరాల పాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయని రెండు రాజకీయ పార్టీలకు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మంగళగిరి దేవస్థానం రోడ్డు చిరునామాతో గ్రేట్ ఇండియా పార్టీ, కొల్లిపర మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో వెనకబడిన వర్గాల మహిళ రైతు పార్టీ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. అయితే ఈ రెండు పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయని కారణంగా కలెక్టర్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీ లోపు అన్నిరకాల ఆధార పత్రాలతో రాత పూర్వకంగా వివరణ లేఖని సచివాలయంలోని ఎన్నికల సంఘం సీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. అలానే సెప్టెంబరు 8వ తేదీన వ్యక్తిగతంగా తన ఎదుట కలెక్టరేట్‌లో హాజరు కావాలని ఆదేశించారు.

సూర్యలంకకు.. అదనపు సొబగులు

- సెప్టెంబరు 27న సూర్యలంక రానున్న ముఖ్యమంత్రి
- రూ.97.52 కోట్ల పనులకు శంకుస్థాపన





హరితా బీచ్‌రిసార్ట్స్ కాటేజీలు



చేపల వేట చేస్తున్న మత్స్యకారులు

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరానికి అదనపు సొబగులు ఒనగూరనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక కేంద్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించింది. రాష్ట్రరాజధాని అమరావతికి అతిసమీపంలో ఉమ్మడి గుంటూరుజిల్లాలో ఉన్న సూర్యలంకసముద్రతీరంలో పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయించారు. బీచ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు గదులు కొరతను దృష్టిలో పెట్టుకొని అత్యాధునిక హంగులతో రిసార్ట్లు ఇతర మౌలికవసతులు కల్పించేందుకు సిద్ధమయ్యారు. స్టార్‌హోటళ్ళు కూడా రానున్నాయి. కొత్తగా 50 గదులు, సందర్శకులు బస చేసే సౌకర్యం కూడా ఏర్పాటు కానుంది. దీనివల్ల పర్యాటకశాఖకు కూడా పెద్దఎత్తున ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే మౌలిక వసతుల కల్పనకు కేంద్రం ద్వారా స్వదేశీ సందర్శన్-2 ప్రాజెక్ట్ కింద 97.52 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. బీచ్ అభివృద్ధి పనులకు టెండర్‌లు ప్రక్రియ కూడా జరుగుతున్నది. సెప్టెంబర్ 26,27,28 తేదిలలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు ఇక్కడ నిర్వహించ తలపెట్టారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ జె.వెంకటమురళి సమీక్షించారు. సెప్టెంబరు 27వ తేదిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూర్యలంక సముద్రతీరానికి వచ్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులతో చర్చించారు.

అవీ..ఇవీ..

గ్రానైట్ క్వారీలో డీఎంఎస్ పరిశీలన

బల్లికురవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్లకొండ వద్ద సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ప్రమాదవశాత్తు ఈనెల 3వ తేదిన ఒడిస్సాకు చెందిన ఆరుగురు కూలీలు మృతి చెందారు. ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీని బుధవారం హైదరాబాద్ జోన్ మైన్స్ అండ్ సేఫ్టీ డెరెక్టర్ వేణుగోపాలరావు (డీఎంస్) బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ప్రమాదం ఎలా జరిగింది. క్వారీలో నిబంధనలు ఎలా ఉన్నాయి. పనులు జరిగిన సమయంలో ఫస్టు క్లాసు మేనేజర్, మేట్‌లు అందుబాటులో ఉన్నారా..? లేదా..? అని తనిఖీలు చేశారు. బెంచ్ పద్దతి ఎలా ఉంది. ర్యాంపు లు, రోడ్లు ఎలా ఉన్నాయి. పోల్యూషన్ ఎలా ఉంది. పనిచేస్తున్న కూలీలు భద్రత చర్యలు ఎలా చేపట్టారు వంటి అంశాలపై విచారణ చేశారు. పనుల వద్ద ఉన్న సిబ్బందిని అడిగి వివరాలను సేకరించారు. ప్రమాదాలు జరిగితే బాధ్యత క్వారీ యజమానులదే అని అన్నారు. నిబంధనలు అమలు చేయకుంటే చర్యలు తప్పవని అయన హెచ్చరించారు.

ఇన్నోవేషన్.. ఓ ఆశాకిరణం

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్లను నమోదు చేసుకున్నాయి. 24 గంటల్లోనే బిజినెస్ స్టార్టప్‌ల కోసం 1,67,321 మంది రిజిస్ట్రేషన్లు జరిపించుకున్నారు.

స్టార్టప్‌లకు ఊతం

'స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా ఇన్నోవేషన్ హబ్‌లు పనిచేస్తాయి. యువతలోని వినూత్న ఆలోచనలను సరికొత్త ఆవిష్కరణల రూపంలో వెలికితీయడమే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ల లక్ష్యం.' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తోపాటు విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురంలో నెలకొల్పిన అనుబంధ కేంద్రాలను ఆయన బుధవారం టాటా గ్రూప్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఓ ఇన్నోవేషన్ హబ్ ఉండాలన్నదే తమ ఆశయమన్నారు. అగ్రిటెక్‌లో ఇన్నోవేషన్‌కు విస్తృతమైన అవకాశాలున్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లో అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే తన నినాదమన్నారు. ఈ లక్ష్య సాధన కోసమే రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓ వైపు సంపదను సృష్టిస్తూనే మరోవైపు పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పేదల జీవన ప్రమాణాలను మరింతగా మెరుగుపరుస్తూ వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గ్రామస్థాయి నుంచి ఆవిష్కరణలు

గ్రామాల నుంచి గ్లోబల్ స్థాయి వరకు అన్ని రంగాల్లో ఆవిష్కరణలు రావాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. యువత వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలను చేయగలిగితే యావత్ ప్రపంచమంతా వాటిని ఆదరించి తీరుతుందన్నారు. ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న తమ సంకల్పంలో ఇదో తొలిమెట్టని తెలిపారు. ఈ కార్యాలయ భవనం లక్షలాది యువతకొక ఆశాకిరణన్నారు. అమరావతిని హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే బాబు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టాటా గ్రూప్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్, మంత్రులు నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్డ్ ఛైర్మన్ బాబాకల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ ఛైర్మన్ గల్లా జయదేవ్, ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కుడికాలువ ఆయకట్టుకు సాగునీటి సరఫరా

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడికాలువ ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు నీటిని విడుదల చేసినట్లు కలెక్టర్ తమీమ్‌అన్సారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుడికాలువ కింద ఐదు నియోజకవర్గాల్లోని 14 మండలాల్లో 1.04 లక్షల ఎకరాల మాగాణి, 1.49 లక్షల ఎకరాల మెట్టకలిపి 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని పేర్కొన్నారు. 97 తాగునీటిచెరువులు, నాలుగు ఎస్ఎస్ ట్యాంకులకు మంచినీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. కుడికాలువ కింద పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని ఆయకట్టు, తాగునీటి అవసరాలకు 132 టీఎంసీల నీటి కేటాయింపు ఉందని, అందులో 43శాతం పూర్వపు ప్రకాశం జిల్లాలోని ఆయకట్టు, తాగునీటి అవసరాలకు కేటాయించారని పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి ఆగస్టు చివరి వారం నుంచి 85/3వద్దనుంచి నీటిని విడుదల చేస్తారని తెలిపారు. సాగర్ నీటిని ఆగస్టు చివరి వారం నుంచి వచ్చేఏడాది మార్చి వరకు అందించనున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి అవసరాల కోసం నింపిన చెరువుల్లోని నీటిని ఆ అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు.

దడ పుట్టిస్తున్న దమ్ము చక్రాలు

- రూ.కోట్లు వెచ్చించి వేసిన రోడ్లపైన నిర్లక్ష్యంగా ప్రయాణం
- ముందస్తు జాగ్రత్తలు పాటించకుంటే రహదారి చిద్రం ఖాయం



బల్లికురవ కొమ్మాలపాడు అర్అండ్‌బీ రోడ్డుపై వెళుతున్న దమ్ము ట్రాక్టర్

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు పాటించకుంటే దమ్ముచక్రాల ట్రాక్టర్లతో కోట్ల రుపాయలతో చేపట్టిన రోడ్లుఛిద్రం అయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే పలు రోడ్లు దుమ్ము చక్రాలతో దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే వాటిలో కొన్ని రోడ్లను అభివృద్ధి పరిచింది. అయితే కొంత మంది రైతులు అవగాహన రాహిత్యం, మరికొంత మంది నిర్లక్ష్యంతో ఈ రోడ్లపై యథేచ్ఛగా దమ్ము చక్రాలను తిప్పుతున్నారు. దీంతో రహదారి దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు స్థానికులు వాపోతున్నారు. అధికారులు రైతులకు తగు సూచనలు చేసి దమ్ము చక్రాలకు రబ్బరు తొడుగులను అందజేయాలని ప్రజలు కోరుతున్నారు. వరిపంట సాగు సీజన్ ప్రారంభం కావడంతో దమ్ము చక్రాల ట్రాక్టర్ల రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. లేకుంటే రోడ్డు గతంలో మాదిరిగానే దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి.

మండలంలో వరిపంటను రైతులు అధికంగా సాగు చేస్తుంటారు. వరిపంట వేయాలంటే పొలం దమ్ము చేసేందుకు ఇనుప చక్రాల ట్రాక్టర్లు అవసరం. దీంతో ఏటా గ్రామాలలోని రోడ్ల పైకి ఇనుప చక్రాల ట్రాక్టర్లు వస్తున్నాయి. దీంతో రోడ్డుపై గుంతలలో గాడులు పడి వర్షాలు కురవగానే అవి పాడైపోతున్నాయి. మండలంలోని కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, ముక్తేశ్వరం, వల్లాపల్లి, చెన్నుపల్లి, కొప్పెరపాలెం, కూకట్లపల్లి, కొప్పెరపాడు గ్రామాల పరిధిలో ఎక్కువ మంది రైతులు వరిసాగు చేసి దమ్ము చక్రాల ట్రాక్టర్లను వినియెగిస్తు న్నారు. అయా గ్రామాలలోని తారురోడ్లు, సీసీరోడ్లు దమ్ము చక్రాలతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. గ్రామాల లో సీసీ రోడ్లపై దమ్ముచక్రాల ట్రాక్టర్లు పొలం వెళ్లేట ప్పుడు ఇంటికి వచ్చేటప్పుడు రోజుకు పలుమార్లు తిరగడంతో సింమెంట్ రోడ్లు గుల్లఅవుతున్నాయి. పొలాల్లోనే దమ్ము చక్రాలను వదిలి వస్తే కొంత వరకు రోడ్డు దెబ్బతినకుండా ఉండే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. అలానే ఇనుప చక్రాల మధ్య రబ్బరు తొడుగులు చుట్టి రోడ్లపై తిప్పితే రోడ్డు దెబ్బతినవని పలువురు చెబుతున్నారు. ఏటా వరి పంట వేసే ముందు దమ్ము చక్రాల ట్రాక్టర్ల గురించే ప్రతి ఒక్కరు చర్చించుకొంటున్నారు. అధికార్లు మాత్రం రైతులకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలం అవుతున్నారు. తక్కువ ఖర్చుతో రబ్బరు తొడుగులు అందించి రైతులకు వాటిని అందజేయాలని, వారు వాటిని వినియోగించకుంటే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇప్పుడు మరలా దమ్ము చక్రాల ట్రాక్టర్లు తిరిగితే ఇటీవల అభివృద్ధి పరిచిన రోడ్లు కూడా పనికి రాకుండా పోతాయని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు.





అభివృద్ధి చేసిన చెన్నుపల్లి వైదన తారు రోడ్డు, దమ్ము చక్రాల తాకిడికి తారు రోడ్లపై పడిన గాడులు

రబ్బరు తొడుగులపై అవగాహన కలిగించాలి

వరిపంట సాగు చేసే రైతులకు దమ్ము ట్రాక్టర్లు రోడ్ల పైకి వస్తే తప్పనిసరిగా రబ్బరు తొడుగు ఉంటేనే వచ్చేలా చర్యలు చేపట్టాలి. అలానే రైతుకు తక్కువ ఖర్చుతో రబ్బరు తొడుగులు అందజేసి వారికి అవగాహన కలిగించాలి. సంబంధిత రవాణా, పోలీసు శాఖల అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది. ముందుగా ట్రాక్టర్లు ఉన్న రైతులను గుర్తించి వారిని ఒక చోటకు చేర్చి వారికి ముందుగా దమ్ముచక్రాల వలన కలిగే నష్టాల గురించి వివరించాలి. రైతుల సమస్యలను కూడా అధికార్లు విని వారికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

కూటమి ప్రభుత్వం రాగానే రహదారుల అభివృద్ధి

టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే గతంలో దెబ్బతిన్న పలు రోడ్లను కోట్ల రూపా యల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచారు. చెన్ను పల్లి వైదన రోడ్డును రూ.3 కోట్లతో, బల్లికురవ సంతమాగులూరు రోడ్డును, అంబడిపూడి గోవాడ రోడ్డును అభివృద్ధి పరిచారు. దీనికి తోడు పలు రోడ్లు ఇప్పుడే అభివృద్ధి చేస్తున్నారు. ఈ రోడ్లు దమ్ము చక్రాల ట్రాక్టర్లతో దెబ్బతినకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బంగారం వ్యాపారిపై కత్తితో దాడి

- రూ.4 లక్షల నగదు, సెల్‌ఫోన్ అపహరణ
- చీరాల ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు
- తాకట్టులో ఉన్న బంగారం కొనేందుకు విజయవాడ నుంచి చీరాలకు
- నిందితులంతా పాత నేరగాళ్లే

లక్ష్మీపురం(చీరాల), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : తాకట్టులో ఉన్న పాత బంగారం అమ్మతామని ఓ వ్యాపారిని నమ్మిం చి అతని వద్ద ఉన్న నగదు దోచుకున్న ఘటన చీరాలలో వెలుగు చూసింది. విజయవాడ చిట్టీనగర్‌కు చెందిన ఎస్‌కే రెహమాన్ తాకట్టులో ఉన్న బంగారం కొనుగోలు వ్యాపారం చేస్తుంటాడు. ఆ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో చీరాలకు చెందిన పలువురు పాతనేరస్థులు మల్లెల రాజేష్, ఆయన బంధువులు కావాటి నాగరాజు, మున్నా, ఇంద్ర, మౌనిక ఈ ప్రకటనపై స్పందించారు. వీరంతా పాత నేరస్థులు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటన ఆధారంగా విజయవాడ చిట్టినగర్‌కు చెందిన ఎస్‌కె రెహమాన్‌ను ఫోన్ ద్వారా సంప్ర దించారు. తమ బంగారం చీరాల్లోని ఓ బ్యాంకులో ఉందని నమ్మించారు. విడిపించి కొనుగోలు చేయాలని చెప్పారు. దీంతో నిజమని నమ్మిన అతను బుధ వారం మధ్యాహ్నం రూ.4 లక్షల నగదుతో చీరాలకు చేరుకున్నాడు. ఈ క్రమంలో పథకం ప్రకారం వీరంతా అతడిని లక్ష్మీపురం ఇంటికి ఆటోలో పిలిపించుకున్నా రు. అక్కడి నుంచి ఇంట్లోకి రమ్మని పలువగా అప్పటికే స్వల్ప అనుమానం చెందిన వ్యాపారి రెహమాన్ ఇంట్లోకి వెళ్లేందుకు నిరాకరించాడు. అయితే బలవంతంగా వారంతా ఇంట్లోకి తీసుకువెళ్లి కాళ్లతో, చేతులతో దాడి చేసి గాయపరిచారు. అప్పటికీ అతను ఎదురు తిరుగుతండడంతో కత్తితో తలపై కుడి భాగం లో గాయపరచారు. అలాగే రూ.4 లక్షలు నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పంపించేశారు. ఆ సమయంలో బాధితుడు వారి కళ్లుగప్పి దాడికి పాల్పడిన కత్తితో చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. అలాగే వేటపాలెం పోలీసులకు, బంధువులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి నేరస్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



గాయపడిన ఎస్‌కే రెహమాన్

దొంగబంగారం ఇస్తామని అనేక ప్రాంతాల వారిని ఆశచూపి చీరాల ప్రాంతంలో చోరీ చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. అయితే సామాజిక మాధ్యమాలను వినియోగించుకొని ఈ తరహా దోపిడీ చేయడం మారిన నేరాల తీరుకు దర్పణం పడుతోంది. ఇదే తరహాలో నింధితులు పలుమార్లు నేరాలు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజావేదికలో వెలుగు చూసిన అవకతవకలు

దర్శి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలో జరిగిన ఉపాధిపనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. జిల్లా డ్వామా పీడీ జి.జోషప్ కుమార్‌ఆధ్వర్యంలో ప్రజావేదిక జరిగింది. 15 రోజులుగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి పనుల్లో జరిగిన అవకతవకలను గుర్తించింది. ఆవివరాలను ప్రజా వేదిక సభలో పంచాయతీల వారీగా వివరించారు.మండలంలో 2024ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మొత్తం1,444 పనులను రూ. 19.21కోట్ల విలువైన పనులుజరిగాయి. మొత్తం 5లక్షల 35వేల పనిదినాలు కల్పించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం పలుగ్రామాల్లో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలను వివరించారు. తొలి రోజు పోతవరం, తూర్పుచవటపాలెం, కొర్లమడుగు,సామంతపూడి, వెంకటాచలంపల్లి, జముకులదిన్న, పెద్దఉయ్యాలవాడ, రాజంపల్లి, మారెడ్డిపల్లి తదిరత గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా మస్టర్లలో అవకతవకలు, పనులకొలతల్లో తేడాలు గుర్తించారు. పలు చోట్ల పని తెలుపు బోరుల్డు ఏర్పాటు చేయలేదని, కూలీలకు నీడ,మంచి నీటి వసతి ఏర్పాటు చేయని విషయాన్ని గుర్తించి వివరాలను ప్రజా వేదికలో వెల్లడించారు. ప్రస్తుతం వెలుగు చూసిన అవకతవకలకు ఎవరు బాధ్యులో సామాజిక తనిఖీ విచారణలో వెల్లడికావాల్సి ఉంది. అవకతవకల వివరాలను వివరించారు. మిగిలిన పంచాయతీలకు ప్రజావేదిక గురువారం నిర్వహిస్తారు. సోషల్ అడిట్‌ప్రోగ్రాం మేనేజర్ ఈశ్వర్, ఆడిటర్ నాగరాజు, ఎంపీపీ సుధారాణి, ఎంపీడీవో వసంతరావునాయక్, ఏపీవో కల్యాణి, మురళి,ఈసీ ప్రసాద్, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మధాతు లోపాలను నివారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కావూరివారిపాలెం(చీరాల), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సాగు సమయంలో సూక్ష్మపోషకాల లోపాల నియంత్రణకు రైతులు సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త కృష్ణవేణి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కావూరివారిపాలెంలో ఎన్‌ఎంఈవో(జాతీయ నూనె గింజల మిషన్) పథకం ద్వారా వేరుశనగ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి నిర్మలాదేవీ ఆధ్వర్యంలో శిక్షణలో శాస్త్రవేత్త పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. పైరులో జింకు, జిప్సంలను వినియోగించి సాగు చేయాలన్నారు. అలాగే రసం పీల్చే పురుగుల నియంత్రణకు 5 శాతం వేప గింజల కషాయాన్ని వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, ఏఈవో రామారావు, విఏఏ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

350 మందికి అన్నదానం



శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో నిర్వహిస్తున్న అన్నదానం

అద్దంకి, ఆగస్టు20 (ఆంధ్ర జ్యోతి): శ్రీరాముడు జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రం ను పురష్కరించుకొని శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో బుధవారం 350 మంది వృద్దులు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు రామమందిరంలో హరేరామ సంకీర్తనలు ఆలపించారు. శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామవృద్ధుల ఆశ్రమం అధ్యక్షుడు రావూరి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం

ఘనంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రథమ మహాసభ



జెండాను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు సంఘటితంగా ఉండి పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం చీరాల పట్టణంలో ఆ సంఘం జిల్లా ప్రథమ మహాసభను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. జెండావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సామ్రాజ్యం, ప్రాంతీయ నాయకులు ఎస్ బాబురావు, రేఖ ఎలిజబెత్, నెల్లూరు డివిజన్ కార్యదర్శి రామిరెడ్డి, సాగర్, సామేలు, రాజు, సింగయ్య, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రాజేశ్వరి, సంధ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

నీట్ జాతీయ స్థాయిలో దీప్తికి 3,100ర్యాంక్

మద్రిపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నీట్ పీజీ పరీక్షలలో మద్రిపూడికి చెందిన ఇనుకొళ్లు దీప్తిరెడ్డి జాతీయస్థాయిలో 3100ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 161వ ర్యాంక్ సాధించింది. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆ యువతి పొదిలిలోని ప్రైవేటు పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించింది. విజయవాడలోని ప్రైవేటు పాఠశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. అనంతరం నీట్ పరీక్షలో నెగ్గి గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. పోస్ట్‌గ్రాడ్యూయేషన్ కోసం నిర్వహించిన నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. దీప్తిరెడ్డిని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరెడ్డి తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో ఖాశింపీరా, ఎస్ఐ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, దీప్తిరెడ్డి తండ్రి మాదిరెడ్డిలు సత్కరించారు. దీప్తిరెడ్డి మాట్లాడుతూ రేడియాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యూయేషన్ చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని చెప్పారు.

అక్రమాల నిగ్గు తేలేనా?

- డీసీసీబీలో అవకతవకలపై సెక్షన్ 51 విచారణ
- విచారణాధికారిగా గౌరీశంకర్
- 4 నెలల్లో నివేదికకు ఆదేశం

డీసీసీబీలో చోటుచేసుకున్న అవకతవకలపై సెక్షన్ 51 విచారణ సజావుగా సాగేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకులో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు ఏ మేరకు వెలుగులోకి వస్తాయన్న సంశయం సహకార శాఖ వర్గాల్లో నెలకొంది. అందుకు గతంలో జరిగిన పరిణామాలు ఊతం ఇస్తున్నాయి. ఒక అధికారిని నాలుగు నెలల క్రితమే విచారణాధి కారిగా నియమించుకోవాలని సహకారశాఖ ఉన్నతాధికారులు సూచించగా జిల్లా ప్రజాప్రతినిధులు వ్యతిరేకించడం, ప్రత్యామ్నాయంగా మరొకరిని వారు సూచిం చినా పట్టించుకోకపోవడం, పైగా తొలుత జిల్లా నేతలు వ్యతిరేకించిన అధికారినే విచారణాధి కారిగా నియమిం చడం లాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అక్ర మాలకు పాల్పడ్డ బ్యాంకు ఉద్యోగులు ఇప్పటికే సదరు అధికారికి టచ్‌లోకి వెళ్లారని, ఇక విచారణ అటకెక్కినట్లేనన్న ప్రచారం విస్తృతంగా సాగుతోంది.

ఒంగోలు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. వీటిపై ఎట్టకేలకు కీలకమైన సెక్షన్ 51 విచారణకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం సహకారశాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు రిజిస్ట్రార్ హోదాలో పనిచేస్తున్న వి.గౌరీశంకర్ విచారణాధికారిగా నియమితులయ్యారు. నాలుగు నెలల్లో ఆ విచారణ పూర్తిచేసి ఇవ్వాలని ఆ అధికారిని ఆదేశిస్తూ సహకార శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు.

త్రీమెన్ కమిటీతో విచారణ

బ్యాంకుపై విచారణ విషయంలో తొలుత సహకారశాఖ ఉన్నతాధికారులు అయిష్టంతో ఉండి జాప్యం చేయగా ఉన్నతస్థాయి జోక్యంతో ప్రాథమిక విచారణ చేయించాలని కలెక్టర్‌కు వారు సూచించారు. తదనుగుణంగా గత ఏడాది అక్టోబరులో అప్పుడు ఇక్కడ ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీ సర్‌గా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి, ఎల్‌డీఎంలతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమిం చారు. ఆ కమిటీ 15 రోజులపాటు పలు అంశాలపై విచారణ చేసి అనేక అవకతవకలు, భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. కొందరు బ్యాంకు ఉద్యోగుల పాత్ర ఆయా అక్రమాల్లో ఉన్నట్లు తేల్చి నివేదికను ఇచ్చింది. సమగ్ర విచారణ కోసం బ్యాంకుపై సెక్షన్ 51 విచారణ చేయించాలని నవంబరులో కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. దానిపైనా సహకార శాఖ ఉన్నతాధికారులు స్పందించకుండా జాప్యం చేశారు.

విచారణకు సహకరించని ఉన్నతాధికారులు

సక్రమంగా విచారణ పూర్తి కావాలంటే పల్నాడు జిల్లాలో అప్పుడు డీసీసీవో కేడర్‌లో పనిచేస్తున్న ఒక అధికారిని నియమించాలని జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులకు సూచించారు. అయితే కొంతజాప్యం తర్వాత వారి సూచనలకు విరుద్ధంగా జిల్లాలో అందుబాటులో ఉన్న అధికారితో విచారణ చేయించాలని, వీలు కాకపోతే కమిషనర్ కార్యాలయలోని అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను వినియోగించుకోవాలని డిసెంబరులో సహకార శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్‌కు సూచిస్తూ సెక్షన 51 విచారణకు అనుమతించారు. తాము సూచించిన అధికారిని విచారణకు నియమించకపోవడంపై జిల్లా కీలక ప్రజాప్రతినిధులు అభ్యంతరం చెప్పగా జిల్లాలో సహకారశాఖ అధికారుల పనితీరు పట్ల అప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్న కలెక్టర్ ఇక్కడే ఆ శాఖ అధికారులతో విచారణకు ఇష్టపడలేదు.

డీసీవోపై వేటు.. పైన అసంతృప్తి

విచారణ ప్రక్రియ అంతటితో ఆగిపోగా అనంతరం ఇక్కడ డీసీవోగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి వ్యవహారంపై ఇటు కీలక ప్రజాప్రతినిధులు, అటు కలెక్టర్ అసంతృప్తితో ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ పరిణామాలన్నింటిపైనా సహకారశాఖ ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉండి సకాలంలో ఇక్కడ డీసీవో నియామకం చేయకుండా డీసీసీబీలో ఓఎస్‌డీగా ఉన్న డీసీవో హోదా కలిగిన ఇందిరాదేవిని ఇన్‌చార్జి డీసీవోగా కలెక్టర్ నియమించారు. దీనిపై ఉన్నతాధికారులు మరింత ఆగ్రహం చెందడం, ఇన్‌చార్జి డీసీవోగా ఇందిరాదేవికి శాఖాపరంగా అవసరమైన గుర్తింపు ఇవ్వకపోవడంతో దాదాపు మూడునెలల పాటు ఆ జిల్లా కార్యాలయ ఉద్యోగులకు జీతాలు కూడా ఆగిపోయి వారు రోడ్డెక్కారు. ఈ అంశాలను వెలుగులోకి తీసుకు వస్తూ ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంతో జిల్లా మంత్రి డాక్టర్ స్వామి స్పందించి ఉన్నత స్థాయిలో మాట్లాడటంతో గత నెలలో ఇందిరాదేవికి ఇన్‌చార్జి డీసీవోగా అధికారాలను ఉన్నతాధికారులు ఇచ్చారు. అనంతరం సిబ్బందికి జీతాలు రావడం, ఇతర శాఖపరమైన వ్యవహారాలు సాగుతున్నాయి.

వద్దు అన్న వారినే నియమించారు..



పీడీసీసీ బ్యాంకు కార్యాలయం

డీసీసీబీపై ప్రభుత్వం ఆదేశించిన సెక్షన్ 51 విచారణపై ఈ పరిణామాల అనంతరం మళ్లీ కదలిక వచ్చింది. ఆ విచారణను కమిషనరేట్‌లో అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను నియమించుకోవాలని సహకారశాఖ కమిషనర్ కలెక్టర్‌కు సూచిస్తూ సహకార శాఖ ముఖ్య కార్యదర్శి గత నెలలో సర్క్యులర్ ఇచ్చారు. అయితే తదనుగుణంగా సహకారశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉండగా కలెక్టర్ ద్వారా ఆ ఉత్తర్వులు ఇవ్వాలని జిల్లా అధికారులకు సూచించినట్లు సమాచారం. చివరకు తొలుత జిల్లా ప్రజాప్రతినిధులు వద్దన్న గౌరీశంకరనే విచారణాధికారిగా నియమిస్తూ సెక్షన్ 51 విచారణకు నాలుగు మాసాల్లో పూర్తిచేసి నివేదించాలని కోరుతూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ విషయాన్ని ముందుగానే గుర్తించిన కొందరు ఉద్యోగులు ఇప్పటికే విచారణాధికారికి టచ్‌లోకి వెళ్లినట్లు సహకారశాఖ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అలా సంప్రదింపులు జరిపిన వారిలో కొందరిపై లోకేశ్వరరావు కమిటీ నివేదికలో అభియోగాలు ఉన్నాయని అలాంటి వారు ముందుగానే విచారణాధికారిని కలవడం వల్ల ఇక విచారణ ఏ మేరకు పారదర్శకంగా జరుగుతుంది, ఎంతవరకు గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలుగుచూస్తాయన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అసలు విషయమిదీ

బ్యాంకులో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుల నుంచి ఇప్పటి వరకు అనేక మలుపులతో పెద్ద తతంగమే జరిగింది. గత వైసీపీ పాలనలో డీసీసీబీలకు, పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకుండా నామినెటెడ్ కమిటీలతో కాలం వెళ్లబుచ్చారు. ఆ సమయంలో డీసీసీబీ పాలక మండలిగా ఉన్నవారు కొందరు ఉద్యోగులతో కలిసి భారీగా అవినీతి, అక్రమాలకు, నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రస్తుత ప్రజాప్రభుత్వం వచ్చాక ఉన్నత స్థాయికి ఫిర్యాదులు వెళ్లాయి. సమగ్ర విచారణ చేయించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కోరారు. జిల్లా మంత్రి డాక్టర్ స్వామి కూడా ఉన్నత స్థాయిలోని వ్యవహారంపై మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

● కారు- ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఘటన

చినగంజాం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం కడవకుదురు గ్రామ సమీపంలోని ఆట్ల ఫ్యాక్టరీ ఎదురుగా చీరాల- ఒంగోలు ఆర్అండ్‌బీ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం సోపిరాల గ్రామానికి చెందిన శిఖరం రాము, గంటా నానిలు తమ ద్విచక్ర వావాహంపై నుండి కడవకుదురులోని అట్ల ఫ్యాక్టరీ నుంచి చీరాల, ఒంగోలు ఆర్అండ్‌బీ రహదారి మీదగా తమ స్వగ్రామానికి వెళ్లేందుకు వస్తున్నారు. అదేసమయంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన రసాని మీరయ్య ఒంగోలు నుండి చీరాల వైపు తన కారులో వెళ్తూ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో శిఖరం రాముకు కుడి కాలుకు తీవ్ర గాయమైంది. గంటా నానికి మొఖం మీద గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన రాముని 108 వాహనంలో చీరాలలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని చినగంజాం పోలీసులు పరిశీలించారు.

ఎరువులు ఉన్నా ఇవ్వరేమిటి..?

● వలపర్ల సొసైటీ పరిధిలో రైతుల ఇక్కట్లు ● నేటి నుంచి పంపిణీ చేస్తామంటున్న సీఈవో ● బయట మార్కెట్‌లో ధరలు అధికం



వలపర్ల సొసైటీ భవనం

మార్టూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇవ్వడానికి మండలంలోని వలపర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో యూరియా, డీఏపీ 20-20 ఎరువులు ఉన్నాయి. కాని ఎరువులు కావాలని సొసైటీ భవనం వద్దకు వెళ్లిన రైతులకు మాత్రం ఎరువులను సరఫరా చేయడం లేదు. సొసైటీ సీఈవో అందుబాటులో ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఒక వేళ ఆయన ఉన్నా కూడా ఏదో ఒక సాగు చెబుతూ రైతులకు ఎరువులు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. దాదాపుగా 15 రోజుల నుండి ఎరువులు కోసం రైతులు తిరుగుతున్నారు. ఈ సొసైటీ పరిదిలో వలపర్ల, ద్వారకపాడు, జే.పంగులూరు మండలం రామకూరుకు చెందిన రైతులు ఉన్నారు. వారం రోజులు నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఈ ఏడాది సాగుకు పొలాలను రైతులు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, ఇతర పంటలను సాగుచేసే రైతులు పొలాలకు ఎరువుల కోసం సొసైటీ వద్దకు వెళుతున్నారు. వారికి ఎరువులు లేవని చెప్పడంతో ఎరువుల కొరత ఏర్పడుతోందని వాపోతున్నారు.

బయట మార్కెట్‌లో ధర అధికం

ఇక యూరియా బస్తా బహిరంగ మార్కెట్లో సుమారు రూ.350 వరకు ధర పలుకుతోంది. సొసైటీలో రూ.268 రులకే రైతుల చేతికి వస్తోంది. దీంతో ఒక బస్తా యూరియా కొనుగోలులోనే రైతుకు రూ.80లకు పైగానే డబ్బులు ఆదా అవుతున్నాయి. అందువలన రైతులు యూరియా బస్తాలు కోసం సొసైటీకి వస్తున్నారు. కాని సొసైటీ సీఈవో రైతులకు ఎరువులను ఇవ్వకుండా వాటిని పక్కదోవ పట్టించారని కొంతమంది రైతులు ఆరోపిస్తున్నారు. గురువారం ఈ సొసైటీలో కొత్తపాలక వర్గం (త్రిమెన్ కమిటి) పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో మంగళవారం ఏవో లావణ్య సొసైటీలో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ రికార్డులలో ఎరువులను రైతులు కొనుగోలు చేసినట్లు సవ్యంగానే ఉందని, ముఖ్యంగా ఈ నెలలో యూరియా బస్తాలను కొనుగోలు చేసి తీసుకువెళ్లిన రైతుల వివరాలను నమోదు చేసిన రికార్డులను సీఈవో తమకు చూపించారన్నారు. ఇదిలా ఉండగా ఈ యూరియా బస్తాలును కొనుగోలు చేశారంటూ బిల్లులలో పేర్లు ఉన్న రైతులను విచారిస్తే నిజానిజాలు బయటపడతాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

ఎరువుల కోసం మూడు రోజులుగా తిరుగుతున్నా

మూడు రోజుల నుంచి డీఏపీ ఎరువులు కోసం జేబులో డబ్బులు పెట్టుకొని సొసైటీ చుట్టూ తిరుగుతున్నాను. కాని ఇంతవరకు ఎరువులు ఇవ్వలేదు. బయట మార్కెట్లో యూరియా బస్తా కొనాలంటే బస్తాకు వంద రూపాయలు ఎక్కువగా పెట్టి కొనాల్సి వస్తోంది.

ప్రత్తిపాటి హనుమంతరావు వలపర్ల



నేటి నుంచి ఎరువులు రైతులకు ఇస్తాం

సొసైటీకి కొత్తపాలకవర్గం వచ్చిన తర్వాత ఎరువులను ఇవ్వాలని అనుకున్నాము. గురువారం కొత్త పాలకవర్గం బాధ్యతలు స్వీకరి స్తోంది. రైతులకు ఎరువులను అందజేస్తాము.

ఈదర నాగేశ్వరరావు, సొసైటీ సీఈవో

నేడు హనుమంతరావు బాధ్యతల స్వీకరణ



మార్టూరు : మండలంలోని వలపర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా కంభంపాటి హనుమంతరావు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అదేవిదంగా త్రిమెన్ కమిటీలో మిగిలిన ఇద్దరు డైరెక్టర్లుగా నాతాని మునిబాబు, తన్నీరు అంకమ్మరావులు బాధ్యతలు స్వీకరించనున్నారు. వలపర్లలోని సొసైటీ భవనంలో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదాలత్

మేదరమెట్ల, ఆగస్టు 20,(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదాలత్ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు విశ్రాంత జడ్జి, సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ ఎం.విక్టర్ ఇమ్మానుయేల్ అన్నారు. మండలంలోని మేదరమెట్ల నిర్వహించిన అదాలత్ అవగాహన సదస్సులో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. మొత్తం 12 అర్జీలు రాగా అందులో 10 పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేం దుకు అదాలత్ చక్కని అవకాశం అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సీజీఆర్ఎఫ్ తరపున విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తు న్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు ఎస్ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షిక అధికారి జి ఆంజనేయులు, ఆర్థిక సభ్యులు ఆర్‌సిహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న జడ్జీ

నేడు ప్రమాణ స్వీకారోత్సవం



గొట్టిపాటి లక్ష్మయ్య

బల్లికురవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ పీఏసీఎస్ ఛైర్మన్‌గా గొట్టిపాటి లక్ష్మయ్య గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. బల్లికురవ గ్రామానికి చెందిన గొట్టిపాటి లక్ష్మయ్య టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడిగా, గతంలో టీడీపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ విజయానికి కృషి చేసిన లక్ష్మయ్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమించేందుకు సిఫార్సు చేశారు. 14 గ్రామాలకు సంబందించిన బల్లికురవ సొసైటీకి లక్ష్మయ్యను నియమించడంతో బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించేందుకు టీడీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

నల్ల, తెల్ల బర్లీసాగు చేపడితే చర్యలు : ఏవో

పంగులూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ వ్యవసాయ సీజనులో నల్ల, తెల్లబర్లీ నారుమడులు పోసినా, సాగుచేపట్టినా చట్టపరంగా చర్యలుంటాయని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని చినమల్లవరం, పంగులూరు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం నల్ల, తెల్లబర్లీ పొగాకు సాగుపై నిషేదం విధించిందన్నారు. రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల వివరాలు ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. కౌలురైతులు సంబందిత అధికారులను సంప్రదించి గుర్తింపుకార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వినయ్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించాడని కేసు నమోదు

నాగులుప్పలపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించాడంటూ యువకుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రేమ వివాహం చేసుకున్న యువకుడికి కోసం మంగళవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన చినగంజాం గ్రామంలోని మార్కెట్ సెంటర్‌కు చెందిన సూదనగుంట ప్రేమ్‌కుమార్ అనే యువకుడు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. దూషించి విధుల కు ఆటంకం కలిగించడంతో కానిస్టేబుల్ వెంకటేష్ ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజియాసుల్తానా తెలిపారు.

ఎన్నికల హామీలను మరచిన చంద్రబాబు

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి



క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభు త్వం ఎన్నికల హామీలను విస్మరించిందని వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చిన్న హనిమిరెడ్డి అన్నారు. 'రీ కాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టోను' గుర్తుచేస్తూ బుధవారం సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెంలో సంతమాగులూరు మండల నేతలతో, అద్దంకిలోని వైసీపీ కార్యాలయంలో అద్దంకి పట్టణ, మండల నాయకుల తో వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చిన్నహనిమిరెడ్డి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, కోయి అంకారావు, గునుపూడి రఘురామగుప్తా తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని పుట్టా వారి పాలెం అడ్డరోడ్డు జంక్షన్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగిన 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ' సభను మండల కన్వీనర్ పూట్ల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అద్దంకి నుంచే పోటీ చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అడవి శ్రీనివాసరావు, ఈదా శ్రీనివాసరెడ్డి, గోలి రమణబాబు, తేలకుట్ల మురహరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలల సిబ్బంది సమయపాలన కరువు

● ఒంటిపూట వైద్యంతోనే సరిపెడుతున్న సిబ్బంది
● ఉదయం 10 గంటల తర్వాతే సేవలు

బల్లికురవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పశువైద్యశాలల సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ప్రతిరోజు పశువులకు ఉదయంపూట వైద్యం అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులు పట్టణ ప్రాంతాల నుంచి వచ్చి, కొద్దిసేపు ఇక్కడ వైద్యం చేసి వెళ్లిపోతున్నారు. కొన్ని చోట్ల అయితే ఒంటిపూట వైద్యం మాత్రమే అందుబాటులో ఉంటోంది. దీంతో రైతులు తమ పశువులకు అవసరమైన చికిత్సల కోసం ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామంలోని పశువైద్యశాల బుధవారం ఉదయం 10 గంటలు దాటిన తెరుచుకోలేదు. ఇక్కడ పనిచేసే ఇరువురు ఉద్యోగులు అద్దంకి, నర్సారావుపేట పట్టణాలను నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం 10 గంటల తర్వాత వచ్చి రెండు గంటలు ఉండి వెళుతున్నారని రైతులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం మాత్రమే పశువులకు వైద్యసేవలు చేయాల్సి ఉందని కాని ఒక పూటకే వైద్యశాలలు మూతవేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పొలాలకు వెళ్లిన పశువులు వచ్చే సమయానికి వైద్యశాలలు మూసి ఉంటున్నాయని ఉదయం అయితే పశువులు పొలాలకు వెళ్లాక వైద్యశాలలు తెరుస్తున్నారని సిబ్బంది సకాలంలో వైద్యశాలలు తెరవడం లేదని రైతులు అంటున్నారు. మండలంలోని బల్లికురవ, కె.రాజుపాలెం, ఉప్పుమాగులూరు, అంబడిపూడి గ్రామాలలో పశువైద్యశాలలు ఉన్నాయి. ఈ వైద్యశాలలు కూడా ఒంటిపూటే తెరిచి ఉంటున్నాయని రైతులు అంటున్నారు. గ్రామాలలో ఉన్న సబ్ సెంటర్లు కూడా సిబ్బంది లేక మూసి వేసి ఉంటున్నాయని వెంటనే ఉన్నత అధికారులు స్పందించి పశువైద్యశాలల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కూకట్లపల్లిలో ఉదయం 10 గంటల తర్వాత మూసే ఉన్న వైద్యశాల

ఎయిడ్స్ రహిత సమాజం లక్ష్యం కావాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి బాలరాజేశ్వరి

పంగులూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, మత్తుపదార్థాల వినియోగ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బాలరాజేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం. జూనియర్ కళాశాల, స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఐవీ, మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తమార్పిడి, లోపభూయిష్టంగా సిరంజీల వినియోగం, అక్రమ లైంగిక సంబధాలతో యువత హెచ్ఐవీ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్ వర్కర్స్ యూనియన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, సంస్థ ప్రతినిధి డాక్టర్ విజయశ్రీ, హెచ్ఎం. సోమేపల్లి శ్రీనివాసరావు, పీడీ సీతారామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ల నిర్మాణం కారణంగా కమటేశ్వర స్వామి గుడి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నామ్‌రోడ్డుకు ఇరువైపులా గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.